
J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 27 09.12.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



• రాష్ట్రాన్ని, జిల్లాలని, నియోజకవర్గాల వారీగా

# ముక్కలు చేసి పంచుకున్నారు

• ఎవరికి వాళ్ళే లెజెండ్ - రాజకీయాలలో కొత్త ట్రెండ్

• గతంలో ఒక్కరే ముఖ్యమంత్రి - ఇప్పుడు నియోజకవర్గానికో సీఎం

***ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోని నెల్లూరుజిల్లాలో కావలి నియోజకవర్గాన్ని 'జాఫ్నా'గా కొందరు అభివర్ణించేవారు. గతంలో శ్రీలంక దేశంలోని ఎల్.టీ.టీ.ఇ ఆక్రమిత ప్రాంతం 'జాఫ్నా'. అక్కడికి వారి అనుమతి లేనిదే ఎవరూ ప్రవేశించడానికి లేదు. ఇదే తరహాలో కావలిలో అప్పట్లో చక్రం తిప్పుతున్న దివంగత నేత కలికి యానాదిరెడ్డి అనుమతి లేనిదే సొంత పార్టీ నాయకులైనా కావలిలో పర్యటించడానికి వీలు లేదు. మొత్తం 294 నియోజకవర్గాలలో ఒక 10 లేదా 15 చోట్ల ఇలాంటి పరిస్థితే ఉండేది. ఇప్పుడు ఆంధ్రాలో యానాదిరెడ్డి తరహా రాజకీయాలు దాదాపుగా రాష్ట్రమంతా కొనసాగుతున్నాయి.***

ఆంధ్రప్రదేశ్‌లోని చాలా జిల్లాలలో ఒకరి నియోజకవర్గంలో మరొకరు జోక్యం చేసుకోవడానికి లేదు. ఒక నియోజకవర్గంలో పెట్టుకునే వ్యాపార సంస్థ ప్రారంభోత్సవానికి కూడా పక్క నియోజకవర్గ శాసనసభ్యుడిని పిలవడానికి వీల్లేదు. ఒకవేళ సంస్థ యజమానులు అభిమానంతో పిలుచుకున్నా ఆ నియోజకవర్గ ఎం.ఎల్.ఏ అనుమతి లేనిదే పక్క నియోజకవర్గ శాసనసభ్యుడు ఆ కార్యక్రమానికి రావడానికి లేదు. కాదూ... కూడదు అని వస్తే ఇక ఆ వ్యాపార సంస్థ యజమానికి చుక్కలు కనపడ్డట్టే. ఇట్లాంటి పరిస్థితి అధికార ప్రతిపక్ష పార్టీల విషయంలో ఉంటే ఏదో రాజకీయ ప్రత్యర్థిత్వమో, అధికార దర్పమో అనుకోవచ్చు. కానీ, సొంత పార్టీలోనే ఇలాంటి సంప్రదాయం కొనసాగుతుండడం ఆంధ్రా రాజకీయాలలో కొత్త పరంపరకు నాయకులు శ్రీకారం చుట్టినట్లుగా అయ్యింది.

ఒకప్పుడు ఎన్నికల సమయంలో వివిధ పార్టీల అభ్యర్థులు ఒకరినొకరు దూషించుకుని, తూలనాడుకున్నా అది ఎన్నికలు అయ్యేంతవరకే పరిమితం. ఎన్నికల తంతు ముగియగానే తాము రాజకీయ ప్రత్యర్థులమే తప్ప, రాజకీయ శత్రువులము కాదన్నట్లుగా అన్ని పార్టీలవాళ్ళూ స్నేహభావంతో మెలిగేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితి అది కాదు. ప్రతిపక్ష పార్టీల వ్యక్తులను బద్ధశత్రువులుగా చూస్తున్నారు. ఒప్పుకుంటే తమ పార్టీ కండువా కప్పడం, లేదంటే కేసులలో ఇరికించి వేధించడం చేస్తున్నారు. తాము, తమ పార్టీ వ్యక్తులకు తప్ప మరొకరి మనుగడే లేకుండా చేయాలని తపిస్తున్నారు.

మరోవైపు ప్రత్యర్థి పార్టీలోకంటే సొంత పార్టీలో కూడా ఒకరంటే ఒకరికి పడటంలేదు. ఒకే వేదికపై కూర్చున్నా కడుపులో కత్తులు పెట్టుకుని ఉంటున్నారు. తమ పార్టీ అభ్యర్థే అయినప్పటికీ ఎప్పుడో రాబోయే ఎన్నికలలో ఓడించడానికి ఇప్పటినుండే ప్రణాళికలు రచించుకుంటున్నారు. ఒకరికి మంత్రి పదవి వొస్తే ఇంకొకరికి కోపం. చివరికి ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకుని కలవడంలో కూడా రాజకీయ కుతంత్రాలు ప్రదర్శించే సంస్కృతి ఆంధ్రా పాలిటిక్స్‌లో కనిపిస్తోంది. రాష్ట్రంలో దాదాపుగా అన్ని జిల్లాలలో ఇదే సీన్ కనపడుతోంది. జిల్లాలోని నియోజక వర్గాలను శాసనసభ్యులు పంచుకుని అధికారులను శాసిస్తున్నారు. ఒకప్పుడు రాష్ట్రానికి ఒక్కరే ముఖ్యమంత్రి, ఆయనే బాస్ అనే భావన ఉండేది. జిల్లా స్థాయిలో కూడా ఒక పెద్దాయన నాయకుడిగా ఉంటే ఆయన సారధ్యంలో అందరూ పనిచేసేవారు. జిల్లాకు ముఖ్యమంత్రి వస్తున్నారంటే అందరూ ఒక చోట చేరి ఏర్పాట్లపై చర్చించుకునేవారు. ఆయన వచ్చి తిరిగి వెళ్ళాక పర్యటనపై సమీక్షించుకునేవారు. ఇప్పుడు పరిస్థితి అలా లేదు. జిల్లాకొక పెద్దదిక్కు ఉన్నా, వాళ్ళను పట్టించుకునే నాధులూ, నాయకులే లేరు. ప్రతి నియోజకవర్గానికీ ఒక నాయకుడు ఉన్నాడన్న భావన కల్పిస్తున్నారు. అక్కడ వాళ్ళే బాస్‌లు, వాళ్ళు చెప్పిందే వేదం, వాళ్ళు గీసిందే గీటు. కాదూ కూడదని గీత దాటితే వేటే! ముఖ్యమంత్రి ఏ నియోజకవర్గంలో పర్యటిస్తుంటే అక్కడ ఆ నియోజకవర్గ శాసనసభ్యుడే కీలకంగా ఉండాలి, ఆయన చెప్పిందే జరగాలి. పక్క నియోజకవర్గ ఎం.ఎల్.ఏలు కార్యక్రమానికి వచ్చామా, వెళ్ళామా అన్నట్లు ఉండాలి తప్ప... ఇతర విషయాలలో తల దూర్చకూడదు. అలా కాదని ఎవరైనా చొరవ తీసుకుంటే పంచాయతీ తాడేపల్లి దాకా చేరుతుంది.

## సీఎంవోలోను ఇదే సీన్...!

## అక్కడా గ్రూపులే...!!

ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా ఉన్న ఆ నలుగురి పోకడ కూడా ఇదే. తమను తామే నాయకుడిగా ఊహించుకుంటున్నారు, తమకంటూ ఒక వర్గాన్ని ఏర్పరచుకుంటున్నారు. జగన్ అనే మూడక్షరాలు తమకు నీడగా లేకుంటే, వీళ్ళను పట్టించుకునే దిక్కే ఉండదన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. అక్కడ కూడా ఒకరంటే ఒకరికి పడదు. ఎవరికి వారే... యమునా తీరే. క్యాంపు కార్యాలయంలో అధినేత అపాయింట్‌మెంట్ దొరకడం అంటే.. అంత ఈజీ కాదు. కాబట్టి పెద్దబాస్ వరకూ వెళ్లలేని ఎం.ఎల్.ఏలు చిన్న బాసులను ఆశ్రయిస్తున్నారు. వాళ్ళకే కష్టసుఖాలు చెప్పుకుంటున్నారు. ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న ముఖ్యులని ఎవరికి తగ్గ రీతిలోవాళ్ళు ప్రసన్నం చేసుకుంటున్నారు. తమ నియోజకవర్గ ప్రతినిధులే ముఖ్యమంత్రికి బదులు ఆయన సన్నిహితులను కలుసుకుని వస్తుంటే ... తామెక్కడికి పోవాలో అర్థం కాక తలపట్టుకుంటున్నామని ఒక ద్వితీయశ్రేణి నాయకుడు వాపోవడం గమనార్హం. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు క్యాంపు కార్యాలయం లోపలిదాకా తెలిసే అవకాశం లేదు. ఇదే అవకాశంగా శాసనసభ్యులు చండశాసనులుగా అవతరించారు. రాష్ట్రాన్ని, జిల్లాలని నియోజకవర్గ వారీగా ముక్కలు చేసి పంచుకున్నారు. తమకు తామే లెజెండ్‌లమనేలా కొత్త ట్రెండ్‌ని ఆంధ్రా రాజకీయాలలో పరిచయం చేశారు. ఈ కొత్త పోకడ భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో వేచి చూడాలి...!





# కర్తవ్యాన్ని ప్రబోధించేదే.. 'భగవద్గీత'

## టిటిడి కల్యాణమండపంలో..ఉత్సాహంగా 'గీతా జయంతి'

'గీతా జయంతి'ని పురస్కరించుకుని డిసెంబర్ 4వ తేదిన నెల్లూరులోని టిటిడి కల్యాణమండపంలో భగవద్గీత కంఠస్థపోటీలు నిర్వహించారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు, న్యాయనిర్ణేతలు భగవద్గీత విశిష్టతను వివరించారు. మార్గశిర మాసంలో శుద్ధ ఏకాదశి రోజున కురుక్షేత్ర సంగ్రామంలో నిరాశానిస్పృలతో నిలిచిన అర్జునునికి శ్రీకృష్ణభగవానుడు కర్తవ్యబోధ చేశాడని, సాక్షాత్తూ భగవంతుడు బోధించిన భగవద్గీత ఎంతో అమూల్యమైనదని ఈ పోటీల న్యాయనిర్ణేతలైన వక్తలు తెలిపారు. తరాలు మారినా యుగాలు మారినా నేటికీ భగవద్గీత ప్రతి మానవునికీ ఎంతో ఉపయుక్తంగా ఉంటూ, ధర్మాచరణను, కర్తవ్య శుద్ధిని బోధిస్తూనే ఉందని, భగవద్గీతను అవగాహన చేసుకుని ఆచరించినవారికి సకల దు:ఖాల నుంచి విముక్తి కలిగి, జీవన్ముక్తి లభిస్తుందని వివరించారు. అనంతరం జరిగిన పోటీల్లో పలు విద్యాసంస్థల నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### విజేతలు వీరే...

జూనియర్స్ విభాగంలో ఎం.సువిధ ప్రథమస్థానాన్ని సాధించి అందరి ప్రశంసలు అందుకోగా, సిహెచ్ అక్షిత్ ఆత్రేయ ద్వితీయస్థానాన్ని, సిహెచ్ అక్షర ఆత్రేయ తృతీయ స్థానాన్ని సాధించారు. భగవద్గీతలోని మొత్తం 700 శ్లోకాల కంఠస్థ పోటీల్లో సీనియర్స్ విభాగంలో ఏ.సుధీర్ ప్రథమస్థానం, బి.చెంచులక్ష్మి ద్వితీయస్థానం పొందారు. అదేవిధంగా జూనియర్స్‌కు జరిగిన పోటీల్లో ఎం.సువిధ ప్రథమస్థానం, సిహెచ్.అక్షర ఆత్రేయ ద్వితీయ, సిహెచ్ అక్షిత్ ఆత్రేయ తృతీయస్థానం సాధించారు. విజేతలకు నిర్వాహకులు పుస్తక బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా అవధాని కోట రాజశేఖర్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, డా.పోలవరపు శంకరయ్యనాయుడు, డా.సింగరాజు శ్రీరామకృష్ణప్రసాద్, అన్నదాత కొమ్మి తిరుపతినాయుడు తదితరులు పాల్గొనగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎన్.దేవరాజులు పర్యవేక్షించారు.

# హాస్టళ్లపై ప్రభుత్వం చిన్నచూపు

**● ఏబివిపి నాయకుల ఆందోళన**

పేద విద్యార్థులు ఉంటున్న హాస్టళ్లను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, విద్యార్థులకు మంచి అన్నం కూడా పెట్టడం లేదని ఏబివిపి నాయకులు మండిపడ్డారు. ఈనెల 4న ఆత్మకూరులో ఏబివిపి ఆత్మకూరు భాగ్ కన్వీనర్ రవికుమార్, నగర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వేణు, భరత్ తదితరులు ఆత్మకూరులోని ఎస్సీ కళాశాల, బీసీ కళాశాలలకు చెందిన ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన ఈ హాస్టళ్లలో విద్యార్థులకు వసతులు సక్రమంగా లేవని, వాటి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక హాస్టళ్ళు నేటికీ అద్దెభవనాల్లో ఉన్నాయని, శాశ్వత భవనాలు లేకపోవడంతో సమస్యలు పెరిగిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఈ హాస్టళ్ళ దీనస్థితిని పరిశీలించి పరిష్కరించాలని, విద్యార్థులకు మంచి భోజనం పెట్టేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు.

# రైతుల భూములు లాగేసుకుంటే సహించేది లేదు

**- కందుకూరు టిడిపి నేత ఇంటూరి**

రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలకు పెద్దఎత్తున ప్రభుత్వ భూములున్నా, పరిశ్రమలను ఆ భూముల్లో స్థాపించకుండా రైతుల నుంచి భూములు లాగేసుకుంటామంటే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ కందుకూరు పార్లమెంట్ నియోజకవర్గం నాయకుడు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఈనెల 4న ఆయన గుడ్లూరు మండలం చేవూరులో భూసేకరణ వ్యతిరేక పోరాటకమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులకు ఇష్టం లేకుండా ప్రభుత్వం అడ్డగోలుగా భూసేకరణ చేయడం సముచితం కాదని ఆయన అన్నారు. తామెవరికీ ఆ భూములు ఇవ్వడం ఇష్టం లేదని కొందరు చేవూరు, రావూరు గ్రామాల రైతులు చెప్తున్నారని, అయినా ఆ భూములను బలవంతంగా ప్రభుత్వం తీసుకోవాలనుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. రైతులకు ఇష్టంలేని భూసేకరణ ప్రక్రియను వెంటనే నిలిపేయాలని, రైతుల వద్ద బలవంతంగా పొలాలు తీసుకునే ప్రయత్నాలను విరమించుకుని, ప్రభుత్వ భూముల్లో ఆ పరిశ్రమలు స్థాపించి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పోరాటకమిటీ నాయకులు మురళి, వెంకటేశ్వర్లు, హరిబాబు, టిడిపి మండలాధ్యక్షుడు నాగరాజుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## గ్రావెల్ అక్రమ తవ్వకాలను
# నిషేధించాలి

**బిజెపి నాయకుడు మిడతల డిమాండ్**



గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిషేధించాలని బిజెపి నాయకుడు, 'నమామి గంగే' (జలసంరక్షణ) రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం వవ్వేరు పంచాయతీలో కనిగిరి రిజర్వాయర్ ఉత్తరాన సహజసిద్ధంగా ఏర్పడిన రాతి తిప్పలు చెరువుకు రక్షణ కట్టగా ఉండేవని, వాటిని గ్రావెల్ కోసం పెద్దఎత్తున తవ్వేయడంతో చెరువు నీరు సీపేజ్ అవుతోందని ఆయన పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలను నిషేధించకుంటే భవిష్యత్తులో కనిగిరి చెరువు రక్షణ కట్ట నుంచి నీటి ఊటలు పెరిగిపోయి, జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన కనిగిరి రిజర్వాయర్‌కు ప్రమాదం ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఆ రాతి తిప్పలు ఏ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ గ్రావెల్ తవ్వకాలను నిషేధించి కనిగిరి రిజర్వాయర్‌ను పరిరక్షించాలని ఆయన కోరారు.

# రెక్కలొచ్చిన పిట్టలా హాయిగా.. 'ఎగురుతున్న పద్యం'

కవిత్వానికి రెక్కలొస్తే ఎలా ఉంటుందో ఊహించి కవిత్వాన్ని సాహితీ విహాయసంలో విహంగంలా ఎగరేసిన కవి అవ్వారు శ్రీధర్ బాబు. నెల్లూరుకు చెందిన ఈ కవి.. వృత్తిరీత్యా ఉపాధ్యాయులైనా, ప్రవృత్తి కవిత్వమే. పెన్నా రచయితల సంఘం వంటి సాహితీసంస్థల నిర్వహణలో ఆయనదే కీలకభూమిక. కవిత్వాన్ని సమాజపరం చేసి, ప్రజలను కవిత్వం ద్వారా చైతన్యవంతం చేయాలన్నదే ఆయన ధ్యేయం. కవిత్వానికి స్వేచ్ఛ ఉండాలనేది ఆకాంక్ష. అందుకే తన కవితా సంపుటికి ఆయన 'ఎగురుతున్న పద్యం' అని పేరు పెట్టారు. సీనియర్ కవి శివారెడ్డి వంటివారు కూడా వర్తమాన కవిత్వాన్ని పద్యమనే అంటున్నారు. ప్రముఖ కవి పఠాభి కూడా 'వచన పద్యాలు' అనే మాటలను వాడి వున్నారు. అందువల్ల ఈ కవి కూడా తన కవిత్వాన్ని హాయిగా 'ఎగురుతున్న పద్యం'గానే భావించి ఉంటారు.

'నేను పదాలను సరిచేసుకుని/బలమైన ప్రశ్నల దారంతో పద్యాన్నొకటి సాహితీ లోకంలోకి ఎగురవేశాను/మనసులను చేరిందేమో/పద్యం రెట్టించిన ఉత్సాహంతో/ఎగురుతోంది ఇంకా'.. అంటారు కవి.

కవితాన్ని సామాజిక సమస్యలకు చిత్రిక పట్టడంలో అవ్వారుది అరుదైన ప్రజ్ఞ. సామాజిక సమస్యలను కవిత్వం ద్వారా తెలియజెప్పి, సమాజాన్ని చైతన్యవంతం చేసేవాడు కవి. అందుకు ప్రతీకగా ఈ కవి కూడా అనేక సామాజిక సమస్యలను ఇతివృత్తం చేసుకున్నారు. 'విత్త వైద్యం' అనే కవితలో ఆయనిలా అంటారు.

*'ఆకాశహర్మ్యాలను పోలిన ఆ హాస్పిటళ్లను చూస్తే*
*రోగుల రక్తమాంసాలే పెట్టుబడి*
*గోడలను తడిమి చూస్తే.కన్నీటి తడి తగులుతుంది.*




**ఎగురుతున్న పద్యం**
**సంపాదకులు:**
**అవ్వారు శ్రీధర్‌బాబు**
**వెల. రూ. 200/- పేజీలు: 136**
**ప్రతులకు : అవ్వారు శ్రీధర్‌బాబు**
**23-1-57, పెండెంవారి వీధి,**
**ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు - 3.**
**సెల్: 85001 30770, 79894 88104**

*ఒకవైపు చావుబతుకుల్లో*
*అంపశయ్యపై నిస్తేజంగా ఉన్న ఆత్మబంధువులు*
*మరోవైపు బతికున్న శవాలను*
*పీక్కుతినే రాబందులు'..* అంటారు ఎంతో ఆవేదనగా. ఇలాంటి కవితలు ఎవరినైనా కదిలిస్తాయి.కరోనాలో ఇలాంటి ఘటనలెన్నో..అందరికీ తెలిసినవే. నేడు వైద్యం..పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. వైద్యం చేసేవారికి ఇటీవలి కాలంలో డబ్బుజబ్బు సోకడం నేటి పరిస్థితికి అద్దం పడుతుంది. ఆ జబ్బుకు కూడా వైద్యం చేయాల్సిన అవసరం నేటి సమాజానికి ఉంది.

'కవిత సూరీడైతే.నేను పొద్దుతిరుగుడు పువ్వునవ్వాలి'..అంటారాయన మరోచోట భావగర్భితంగా. ఎంత మంచిమాట! ఇలాంటి కండగల కవితలెన్నో ఉన్నాయిందులో.

*'కొమ్మన కూర్చున్న పిట్టొకటి..*
*అన్నీ ఎరిగినదానిలా*
*వేదాంతపు పాటొకటి పాడుతోంది'..*

అంటూ మనలో నిద్రపోతున్న చైతన్యాన్ని మేల్కొలుపుతారు. ఇలా ప్రతి కవితలో కవి హృదయం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతికవితా సమాజ శ్రేయస్సు కోసం పడే తపనకు నిలువుటద్దంలా ఉంటుంది. అవ్వారుది ఇది రెండో కవితా సంపుటి. మొదటిది కవితావనంలో పరచిన 'పూల తివాచీ'. హృదయం ఉన్న కవిత్వం ఆయన కవితల్లో కనిపిస్తుంది. శ్రీధర్‌బాబు మరిన్ని కవితా సంపుటులు వెలయించి కవితాక్షేత్రాన్ని మరింత సుసంపన్నం చేస్తారని ఆకాంక్షిద్దాం!....



**సమీక్షకులు:**
**డా. గంగిశెట్టి శివకుమార్**
**నెల్లూరు. 94418 95343**

# చేజర్లలో 'ఇంటింటా జ్వరాలు'

ఇంటింటా జ్వరాలతో చేజర్ల మండలంలోని పలు గ్రామాల ప్రజలు గోడుగోడుమంటున్నారు. చలి వాతావరణం కారణంగా ఎక్కడ చూసినా జ్వరాలు, వొళ్ళు నొప్పులతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా మండలంలోని మడపల్లి, తిమ్మాయపాళెం, బోడిపాడు తదితర గ్రామాల ప్రజలు జ్వరపీడితులై అవస్థలు పడుతున్నారు. ప్రతి ఇంటా ఒకరికి జ్వరమే. ఎన్ని మాత్రలు మందులు వేసుకుంటున్నా వారం పది రోజులు గడిచినా ఆ మాయదారి జ్వరాలు తగ్గడంలేదని వారు వాపోతున్నారు. కొంత మంది స్తోమతు గలవారు మాత్రం వైద్యం కోసం పట్టణాలకు కూడా పోతున్నారని, పేదలు ఎక్కడికీ పోలేక మంచంలోనే ఉండిపోతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యఆరోగ్యశాఖ అధికారులు వెంటనే చొరవ తీసుకుని ప్రతి ఇంటినీ పరిశీలించి జ్వరపీడితులను గుర్తించి తగు చికిత్సలు చేయాలని, వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి ఈ వ్యాధుల బాధలు నివారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# మూడేళ్ళుగా విద్యార్థులకు..దుప్పట్లు లేవు

**దళిత సంఘర్షణ సమితి నాయకుని ఆవేదన**

గత మూడేళ్ళుగా జిల్లాలోని అనేక సాంఘిక సంక్షేమ వసతి గృహాలు (హాస్టళ్ళ)లో విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వడం లేదని, దీంతో నిరుపేదలైన ఆ విద్యార్థులు వానాకాలం, శీతాకాలంలలో చలికి వణికిపోతున్నారని జిల్లా దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు ఎస్. మల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 4న ఆయన బోగోలులో మాట్లాడుతూ, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు చాలీచాలని అన్నం పెడుతున్నారని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనసదుపాయాలు ఉండడం లేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల సంక్షోభ హాస్టళ్లుగా తయారయ్యాయని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే ఈ దుస్థితిని పరిశీలించి హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని, మెనూ సక్రమంగా పాటించేలా చూడాలని ఆయన కోరారు

# మనుబోలులో నేత్రవైద్య శిబిరం

మండల కేంద్రమైన మనుబోలులోని శాంతి సేవాసంస్థ అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో ఈనెల 4న ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. స్థానిక ఆర్ఆర్ ఫిజియోథెరపీ క్లినిక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది రోగులకు కంటిపరీక్షలు చేసి మందులిచ్చారు. డాక్టర్లు అమరేంద్ర, భవాని, డాక్టర్ ప్రత్యూష, కో-ఆర్డినేటర్ అనూష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పదవులకే వన్నె తెచ్చిన నేత వెంకయ్య



## చెన్నై మీట్ & గ్రీట్‌లో ఆత్మీయుల ప్రశంస





నెల్లూరు ముద్దుబిడ్డ, మన ముప్పవరపు వెంకయ్యనాయుడు భారత ఉపరాష్ట్రపతిగా ఉన్న సమయంలో 'సంగమం' పేరుతో దేశవ్యాప్తంగా తన ఆప్తులను, ఆత్మీయులను, చిన్ననాటి మిత్రులను ఢిల్లీకి పిలిపించుకుని వారం దరితో ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపే వారు. ఇప్పుడు ఆయన పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడ వాళ్ళందరూ ఆయనను సత్కరించుకుంటున్నారు. ఆయనతో వున్న అనుభవాలని, అనుబంధాన్ని, తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. తమ అభిమాన నాయకుడిని ఆత్మీయంగా సత్కరించుకుంటున్నారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక చోట్ల ఆయన అభినందన కార్యక్రమాలు జరిగాయి. కర్ణాటకలోని బెంగళూరులో కూడా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

తాజాగా డిసెంబర్ 5వ తేది, సాయంత్రం చెన్నై మహానగరం, అన్నాసలైలోని 'రైన్ ట్రీ' హోటల్ మరో ఆత్మీయ వేడుకకు వేదికయ్యింది. మద్రాసు నగరంలోని వెంకయ్య సన్నిహితులంతా ఏకమై 'మీట్ & గ్రీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యులు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, సీనియర్ జర్నలిస్టు స్వామినాథన్ గురు మూర్తి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యులు తిరునావుక్కరసు, కేంద్రమంత్రి లోకనాథన్ మురుగన్, సీనియర్ రాజకీయవేత్త రాజ్యసభ సభ్యులు వైకో, సీనియర్ వైద్య నిపుణులు, తమిళనాడు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి డాక్టర్ హెచ్.వి.హండేలు ఈ కార్యక్రమంలో ప్రసంగించి వెంకయ్యతో తమకున్న అనుభూతు లను పంచుకున్నారు. సాధారణంగా పదవుల వల్ల వ్యక్తులకు గుర్తింపు వస్తుందని, కానీ వెంకయ్యనాయుడు ఏ పదవిలో ఉంటే ఆ పదవికి విలువ పెరుగుతుందని ప్రశంసించారు.

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అన్ని సమయాలలో తనకు తోడుగా నీడగా ఉంటూ తనకు మనోస్థైర్యాన్ని ఇచ్చింది తన ఆప్తులు, సన్ని హితులు, స్నేహితులే అన్నారు. అప్పటినుండి ఇప్పటి వరకు తనను అభిమానిస్తున్న ప్రతిఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నానని అన్నారు. చెన్నైలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

సీ(ట్రోస్ సుబ్బారెడ్డి, కెన్సెస్ నరసారెడ్డి, చక్రవర్తి నాయుడు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమా నికి వెంకయ్య కుమార్తె దీపా వెంకట్ అధ్యక్షత వహిం చగా, రవీంద్ర సన్నారెడ్డి 'వర్డ్ ఆఫ్ థ్యాంక్స్'తో వేడుక ముగిసింది. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, బీద మస్తాన్‌రావు, డాక్టర్. సి.యం.కే రెడ్డి, దొడ్డ శేషారెడ్డి, ఎస్.పి.చరణ్, ఎస్.పి.శైలజలతో పాటు అనేకమంది రాజకీయ, వ్యాపార, పారిశ్రామిక ప్రము ఖులు వెంకయ్య స్నేహితులు, సన్నిహితులు మీట్ & గ్రీట్ కార్యక్రమానికి హాజరై వెంకయ్యని సత్కరించారు.








# రెచ్చగొట్టినా..రెచ్చిపోకండి

- ప్రత్యర్థుల ఉచ్చులో పడకండి
- అనుచరులకు శ్రీధర్‌రెడ్డి హితవు



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తమకున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని కొంతమంది వ్యక్తులు, నాయకులు తమను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటిని చూసి మీరు కూడా రెచ్చిపోతే దానినే బూచిగా చూపి, ప్రజల్లో మనల్ని పలుచన చేయాలని చూస్తున్నారని, కనుక అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమ అనుచరులకి, నాయకులకి, కార్యకర్తలకి అందరికీ విజ్ఞప్తి చేశారు. ఈనెల 8వతేది గురువారం మధ్యాహ్నం ఆయన తమ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. తమతో నడిచే నాయకులు, కార్య కర్తలు, శ్రేయోభిలాషులను ఉద్దేశించి ఆయన మాట్లా డారు. రూరల్ నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులు తనకు మెండుగా ఉండడంతో, అది సహించలేనివారు వ్యక్తిగత దూషణలతో, అభ్యంతరకర వ్యాఖ్యలతో రెచ్చ గొడుతున్నారని, వాటికి స్పందించవద్దని, అభ్యంతరకర సోషల్‌మీడియా పోస్టింగ్‌లకి కామెంట్లు కూడా పెట్ట వద్దని చెప్పారు. తమని రాజకీయంగా ఎదుర్కోలేని వ్యక్తులు చేసే ఆ కుతంత్రాల ఉచ్చులో పడవద్దని ఆయన వారికి సూచించారు. అలాంటి దుష్ప్రచారా లను ప్రజల అండతో ఎలా ఎదుర్కోవాలో తమకు బాగా తెలు సని, చెప్పాల్సిన చోట, చెప్పాల్సిన సమాధానం ప్రజలే చెప్తారని ఆయన అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉం డడం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరా డడం, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడడం మనకు ప్రధానమని, అందరూ ఆ విషయాలపై దృష్టి సారించాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రత్యర్థులు మరింత రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తారని, చివరికి తన కుటుంబసభ్యులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తారని, అవన్నీ ప్రత్యర్థుల వ్యూహంలో భాగమేనని, అది గమనించి తమ వెంట నడిచే నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ప్రత్యర్థుల కుయుక్తులకు లోనుకాకూడదని ఆయన కోరారు. తనను రాజకీయంగా, లేదా వ్యక్తిగతంగా వ్యతిరేకించే వారి ఆగడాలు భరించలేని పరిస్థితే వస్తే, న్యాయపోరాటాలు చేద్దామన్నారు. ఓర్వలేని వాళ్ళ మాటలను అసలు లెక్కచేయవద్దన్నారు. ప్రజలే మనకు కొండంత అండ అని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీలో రహదారుల స్థితిగతులేమిటి?

**- రాజ్యసభలో డా. బీదా మస్తాన్‌రావు ప్రశ్న**



ఆంధ్రప్రదేశ్‌లోని జాతీయ రహదారుల పరిస్థితులు, నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి మంత్రిత్వశాఖ తీసుకున్న చర్యలేమి టని ఈనెల 7న రాజ్యసభలో సభ్యులు డా.బీదా మస్తాన్‌రావు ప్రశ్నించారు. అందుకు రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీ సమాధానమిస్తూ వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి రాష్ట్ర రహదారులను కొత్త జాతీయ రహదారులుగా ప్రకటించడానికి మంత్రిత్వశాఖ అనేక ప్రతిపాదనలను స్వీకరిస్తూనే ఉంటుందని, ఎప్పటికప్పుడు కొన్ని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటిస్తుంటుందని తెలిపారు. ఎన్‌హెచ్ఏఐ ద్వారా అమలు చేయబడిన కృష్ణపట్నం పోర్ట్‌కి 6-లేనింగ్ పోర్ట్ రోడ్ యొక్క డెడికేటెడ్ పోర్ట్ రోడ్డు నిర్మాణం ఆలస్యమైందని, అలాగే భూసేకరణ, ఫారెస్ట్ క్లియరెన్స్, కాంట్రాక్టర్ల ఆర్థిక పరిమితులు మరియు కోవిడ్ మహమ్మారి వంటి వివిధ కారణాల వల్ల కొన్ని రహదారి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో జాప్యం జరి గిందని తెలిపారు. మే 2031 వరకు రాయితీ వ్యవధిని కలిగి ఉన్న బిఓటి కింద ఎన్‌హెచ్-16 యొక్క తడ-నెల్లూరు విభాగం ఇప్పటికే 4-లేన్ ఎన్‌హెచ్‌కి అభివృద్ధి చేయబడిందని, కనుక తడ-నెల్లూరు సెక్షన్ యొక్క ఆరు లేనింగ్ కోసం ప్రతిపాదనను ట్రాఫిక్ అవసరాలు, నిధుల లభ్యత తదితరాల ప్రాధాన్యతలకు లోబడి రాయితీ వ్యవధి ముగిసిన 2031 సంవత్సరం తర్వాత ప్రారంభించవచ్చునని తెలియచేశారు.

## మాగుంట శీనయ్య బావమరిది

# నాగారెడ్డి గిరిధర్‌రెడ్డి కన్నుమూత



అన్న సుధాకరరెడ్డిని దూరం చేసుకున్న శోకం తీరక ముందే ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శీనయ్యకి మరో కష్టం వచ్చింది. తన సతీమణి గీతాలత చిన్న తమ్ముడు నాగారెడ్డి గిరిధర్‌రెడ్డి డిసెంబర్ 7వతేది కన్ను మూశాడు. గిరిధర్ వయస్సు 58 సంవ త్సరాలు. కొంతకాలం క్రితమే ఆయన భార్య కూడా మరణించారు. గిరిధర్‌రెడ్డి కూడా అనారోగ్యంతో ఉంటూ బుధ వారం కన్నుమూశారు. నాగారెడ్డి మాగుంట కుటుంబాలకు ప్రగాఢ సాను భూతిని తెలుపుతోంది.. 'లాయర్'.

## మాజీ యం.డి.ఓ మస్తానయ్య సతీమణి

# వరిగొండ శారదాంబ కాలధర్మం



యం.డి.ఓగా, నిఖార్సైన అధికా రిగా నెల్లూరు జిల్లాలో పేరు తెచ్చు కుని పదవీ విరమణ పొందిన వరిగొండ మస్తానయ్య సహధర్మ చారిణి శారదాంబ తన 78వ యేట డిసెంబర్ 2వతేదీ తుదిశ్వాస విడిచారు. మస్తానయ్య- శారదాంబ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శారదాంబకు ఆధ్యాత్మిక చింతన, దైవ భక్తి ఎక్కువ. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగే దసరా నవరాత్రులలో నిండు ముత్తయిదువుకి 9వ రోజు జరిగే సువాసిని పూజను ఆమె మూడుసార్లు అందుకున్నారు. శారదాంబ మృతికి నివాళులర్పిస్తూ... మస్తానయ్య కుటుం బానికి ప్రగాఢ సానుభూతిని తెలుపు తోంది 'లాయర్'.

# క్రీడలకు 'అక్షర' ప్రోత్సాహం.. అభినందనీయం

**ప్రశంసించిన మంత్రి కాకాణి**

వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో డిసెం బరు 3 నుంచి 5వతేది వరకు సిబిఎస్ఇ క్లస్టర్ 7వ బాస్కెట్‌బాల్ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన పలు సిబిఎస్ఇ స్కూళ్ళకు చెందిన దాదాపు 1200 మంది క్రీడాకారులు, మొత్తం 80 బాలుర టీమ్‌లు, 30 బాలికల టీమ్‌లు పాల్గొన్నాయి. ఈనెల 5న విజేతలకు బహు మతి ప్రదానంతో పాటు ముగింపు వేడుక ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆశయాలకు అనుగుణంగా అక్షర విద్యా లయంలో విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదా యాలను, క్రీడలను కూడా ప్రోత్సహిస్తుండడం ఎంతో అభినందనీయమన్నారు. వెంకయ్యనాయుడు కుమార్తె, అక్షర విద్యాలయ కరెస్పాండెంట్ దీపా వెంకట్ సూచనలతో ఈ టోర్నమెంట్ జరగడం సంతోషకర మన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో విన్నర్స్‌గా చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్(హైదరాబాద్)కు, రన్నర్స్‌గా నిలచిన ఢిల్లీ పబ్లిక్‌స్కూల్(ఖాజాగూడ)కు బహుమతు




లిచ్చి అభినందించారు. అదేవిధంగా బాలికల విభాగంలో విన్నర్స్‌గా నిలచిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు, రన్నర్స్.. చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు మెమొంటోలందజేశారు.

లాయర్
డిసెంబర్ 09, 2022

# జీ-20 సారథ్యం.. భారత్‌కు గర్వకారణం

భారత్‌కు జి-20 అగ్రదేశాల కూటమికి అధ్యక్షత్వం వహించే అద్భుత అవకాశం లభించడం చరిత్రాత్మకం.. ప్రపంచశాంతిని కాంక్షించే భారత్‌కు గర్వకారణం కూడా. ఒకవైపు కరోనా మహమ్మారి, మరోవైపు వాతావరణ విపత్తులు, ఇంకోవైపు ఆర్థికమాంద్యం, ఇవన్నీ చాలవన్నట్లు ఉక్రెయిన్-రష్యా యుద్ధతీవ్రతలు, అన్నివైపులా పొంచివున్న ఉగ్రవాదం వంటివి ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్న తరుణంలో, కారుచీకటిలో కాంతిరేఖలా భారత్.. ప్రపంచానికిప్పుడు మార్గదర్శనం చేసే సమున్నతస్థాయికి ఎదిగింది. భారతీయులందరికీ ఇది ఎంతో సంతోషకరమైన విషయం. ఒక్క మాటలో చెప్పాలంటే జి-20 నేతృత్వం రావడం ఒక్క భారత్‌కే కాదు, ప్రపంచానికే అనుకోని అదృష్టం. ప్రపంచబాధ్యతల్లో భాగం పంచుకొని, వసుధైక కుటుంబమే లక్ష్యంగా ముందుకు సాగుతూ, సమస్యల పెనుసవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు, తద్వారా భారత్ తన సత్తాను నిరూపించుకునేందుకు ఇదొక సువర్ణావకాశం. వాస్తవానికి ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన దేశాలకు, అతిపెద్ద 20 ఆర్థిక వ్యవస్థలతో కూడిన అంతర ప్రభుత్వ వేదికగా ఉన్న జి-20కి సారథ్యం వహించడమంటే చిన్న విషయమేమీ కాదు. ఇందులో భారత్‌తో పాటు అగ్రదేశాలైన అమెరికా, రష్యా, చైనా, జపాన్, జర్మనీ, ఇటలీ వంటి అగ్రదేశాలెన్నో ఉన్నాయి. ప్రపంచ జనాభాలో మూడింట రెండువంతులున్న ఈ దేశాల కూటమికి అధ్యక్ష స్థానం వహించడమంటే ప్రపంచం ఎదుర్కొంటున్న జటిలమైన సమస్యలతో సవాల్ చేయడమే. ముఖ్యంగా అంతర్జాతీయ విధానాలపరంగా జీ-20 ప్రపంచంపై బలమైన రాజకీయ ప్రభావం కూడా చూపే కూటమి. సుస్థిర అభివృద్ధి, వాతావరణ కార్యాచరణ, ఆహార భద్రత, ప్రజారోగ్యం, డిజిటల్ పరివర్తన వంటి కీలకాంశాలెన్నో ఇందులో ఇమిడివున్నాయి. ప్రపంచ దేశాల సంక్షేమానికి బృహత్తర కార్యాచరణ పథకాలను ప్రతిపాదించే సమున్నత స్థాయి గౌరవం ఇప్పుడు భారత్‌కు అధికారికంగా రావడం ఎంతైనా అపూర్వం. అందులోనూ 'ఒకే భూమి-ఒకే కుటుంబం-ఒకే భవిష్యత్తు' అనే బృహత్తర నినాదంతో, సమస్యలను సమసిపోయేలా చేసి, మానవాళికి శుభప్రదమైన సరికొత్త ప్రపంచాన్ని నిర్మించాలనే ఆశావహ దృక్పథంతో ప్రపంచానికి మార్గదర్శకం చేస్తూ ముందుకు సాగుతున్న భారత ప్రధాని నరేంద్రమోడీ డిసెంబరు 1వ తేదీన జీ-20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం ప్రపంచదేశాలన్నిటికీ ఎంతో సంతోషం కలిగిస్తోంది. అన్ని దేశాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రపంచ భద్రత కోసం అహరహం శ్రమించడం, సకల మానవాళికి కనీస మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తేవడం, వాతావరణ మార్పులను అనుకూలంగా మలచుకోవడం, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం, పెనుసవాళ్లను సైతం ధీటుగా ఎదుర్కొనే కార్యాచరణ పథకాలను రూపొందించడం వంటివన్నీ ఇప్పుడు జీ-20 సారథ్యంతో భారత్‌కు లభించాయి. ప్రపంచానికే కాదు, మొత్తంగా ఈ భూమండలానికే ప్రమాదకరంగా పరిణమిస్తున్న కాలుష్యాల పట్ల, 'మనందరికీ ఉన్నది ఒకే భూమి.. ఆ భూమిని కాలుష్యాలతో, కర్బన ఉద్గారాలతో నాశనం చేసుకోకుండా రక్షించుకోవడం అందరి విధి' అని చెప్పడమే కాక, ధరిత్రిని పచ్చదనంతో పర్యావరణ సమతుల్యతతో పరిరక్షించుకునేందుకు ఏం చేస్తే బాగుంటుందో భారత్‌కు ఒక సమగ్రమైన అవగాహన ఉంది. అందుకే ప్రధాని మోడీ సారథ్యంలో నేలతల్లిని సంరక్షించేందుకు పథకాలు, పర్యావరణహితమైన జీవనసరళిని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసేందుకు ఎన్నో మహత్తరమైన కార్యాచరణ ప్రణాళికలు శరవేగంగా సిద్ధమవుతున్నాయి. ప్రపంచమే ఒక కుటుంబంగా భావించే భారత్, అందరూ హాయిగా.. స్వేచ్ఛగా మనుగడ సాగించే దిశగా తనవంతు శక్తివంచన లేకుండా కృషిచేస్తుందనే గట్టి నమ్మకం. ప్రపంచదేశాలన్నిటికీ ఉండడం ఎంతో గొప్ప విషయం. శాంతి సామరస్యాలతో, స్వేచ్ఛా సమానత్వాలతో, ప్రగతి ఫలాలను సకల మానవాళికి అందించాలనే ఏకైక ధ్యేయంతో, ప్రపంచానికే దిశ-దశ నిర్ధారించాలనే సమున్నతాశయంతో.. దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్న భారత్.. ఇక ప్రపంచ ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా ఆ లక్ష్యాన్ని సాధించితీరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఏదేమైనా అంతటి విశిష్టమైన స్థానాన్ని అధిరోహించి, 'మానవ కేంద్రీకృత ప్రపంచీకరణ' అనే నూతనదృక్పథంతో ప్రపంచ సమస్యలపై ఇక..సమరశంఖం మోగించనున్న జీ-20 రథసారథి.. మన ప్రధాని మోడీకి.. జయం కలగాలని ప్రజలందరి తరపున ఆశిస్తూ!..... విజయోస్తు!...

# 'వసతి' శూన్యం..బతుకు దైన్యం!



'వీణ్ణి హాస్టల్‌లో పడేస్తే తప్ప తిక్క కుదరదు'.. ఈ మాట ఇప్పటికీ వాడుకలోనే ఉంది. 'హాస్టల్‌లో ఉండడం' అన్నది ఒక శిక్ష అన్నది దాని అర్థం. అందుకు కారణాలెన్నో ఉన్నాయి. హాస్టల్‌లో ఉంటే వేళకు తిండి పెట్టరని, ఒకవేళ పెట్టినా అది ఏ పురుగులన్నమో, గబ్బుకొట్టే సాంబారో పోస్తారని.. ఇప్పుడు కాదు, ఎప్పటినుంచో ఒక అపోహ జనంలో ఉంది. అయితే అది కేవలం అపోహేనా అంటే..'కాద'ని చెప్పలేం. ఎందుకంటే అనేక హాస్టళ్లలో ఇప్పటికీ వసతులు బాగుండడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా వీటి నిర్వాహకుల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండడం లేదు. ఇరుకు గదులు, సరిగ్గాలేని స్నానం గదులు, శుభ్రత లేని మరుగుదొడ్లు, టాయ్‌లెట్లు..ఇంకా హాస్టళ్ల సమస్యల నిలయాలుగానే ఉంటున్నాయి. వసతులు శూన్యం కావడంతో వారి బతుకులు కూడా దైన్యంగా మారుతున్నాయి.

రాష్ట్రంలో లక్షలాదిగా హాస్టళ్లున్నాయి. ప్రభుత్వమే వీటిని నిర్వహిస్తోంటుంది. పేదపిల్లలకు చదువు చెప్పాలనే ప్రభుత్వ ఆశయం ఎంతో గొప్పది. నిరుపేద బాలబాలికలకు, ఉన్నత విద్య దాకా బాగా చదువుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహన్నిస్తూ ఎంతోకాలంగా పాఠశాలలే కాక, వారు అక్కడే ఉండి చదువుకునేందుకు వీలుగా వసతి గృహాలు(హాస్టళ్లు) కూడా నిర్వహిస్తోంది. కోట్లాదిరూపాయల నిధులను దీనికోసం ఖర్చుపెడుతూనే ఉంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన లక్షలాదిమంది బడుగుజీవుల బిడ్డలకు వసతి గృహాలు ఏర్పాటుచేసి, వాళ్లకి ఉచితంగా అన్నంపెట్టి, వసతులు సమకూర్చి, చదువు చెప్పించడం చిన్న విషయమేమీ కాదు. అందుకు పెద్ద వ్యవస్థే కావాలి. 'సాంఘికసంక్షేమ శాఖ' రూపుదిద్దుకుంది అందుకే. ప్రభుత్వం విద్యార్థులు, చిన్నారుల సంక్షేమానికి అన్నీ ఇస్తున్నా..ఆ సౌకర్యాలు మాత్రం పిల్లలకు చేరకపోవడం ఘోరం. ఎంత శ్రద్ధ తీసుకుంటున్నా, వీటి నిర్వహణ అంతా ఒక మాయగా ఉంటుంది. 'సంక్షేమ' హాస్టళ్లు అని చెప్పుకుంటున్నా అందులో సంక్షేమం 'నేతిబీరలో నెయ్యి'లాగే ఉంటోంది. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే లక్షలాదిమంది చిన్నారులు, బాలబాలికలు ఈ హాస్టళ్లలో ఉంటున్నారు. ప్రత్యేకించి బాలికల వసతిగృహాలు కూడా ఉన్నాయి. వీళ్ళందరికీ ఏరోజు ఏం పెట్టాలో ప్రభుత్వం

## సమస్యల తో 'రణం'

నిర్దేశిస్తూ 'మెనూ' (ఆహార పట్టిక)ను కూడా ఇస్తుంది. బాలలకు మంచి పౌష్టికాహారం పెట్టాలని 'మెనూ' రూపొందించారు. పొద్దున్నే పాలు, అల్పాహారంగా ఉడకబెట్టిన కోడిగుడ్లు, పులుసన్నం, ఉప్మా, ఇడ్లీలు, విరామ సమయంలో వేరుశెనగ చిక్కీలు, మధ్యాహ్నభోజనంలో మంచి అన్నం, కూరలు, సాయంత్రం రాగి జావ, రాత్రి భోజనంలో అన్నం-కూరలతో పాటు, చికెన్ కర్రీ, అరటిపండ్లు..ఇవన్నీ మెనూలో ఉంటాయి. ఆ 'మెనూ' చూస్తే ఎవరికైనా నోరూరుతుంది. కానీ, ఆచరణలో చాలాచోట్ల అవి కనిపించవు. అన్నం చిమిడిపోయి ఉంటుంది. కూరలు పాసిపోయి ఉంటాయి. కోడిగుడ్లు అందరికీ ఇస్తారన్న గ్యారంటీ ఉండదు. బాలలకు మంచి అన్నం పెట్టాలన్న జ్ఞానం కూడా కొంతమంది నిర్వాహకులకు ఉండదు. అదే, వారి బిడ్డలైతే మాత్రం..అలా ఉంటారా?..వీటిని పర్యవేక్షించేవాళ్ళు కూడా అంతకన్నా నిర్లక్ష్యంగా ఉంటారు. కంచే చేను మేస్తే ఎవరికి చెప్పుకోవాలి?.. చలికి గజగజ వణికిపోతున్నా కొన్ని హాస్టళ్లలో దుప్పట్లు అందుబాటులో ఉండవు. అందులోనూ వానాకాలం, శీతాకాలం రోజుల్లో హాస్టల్ విద్యార్థులు పడే బాధ వర్ణనాతీతం. ఇరుకిరుకు గదుల్లో కుప్పపోసినట్లుగా విద్యార్థులంతా చలికి తట్టుకోలేక అతుక్కుని పడుకుని ఉంటారు. ఎంత దయనీయం?..కొన్ని హాస్టళ్లలో స్నానానికి సబ్బులు లేక ఉత్తనీళ్లతోనే స్నానాలు చేస్తుంటారు. దీంతో చర్మవ్యాధుల బాధ..పడేవాళ్లకే తెలుస్తుంది. ఎంత బాధాకరం?..అయితే, ఏ కొద్దిమందో మంచివాళ్లుంటారు. ఆ పుణ్యం ఎక్కడికి పోతుంది!.. వారి దయవల్ల హాస్టళ్లలో చదువుకున్న పేదపిల్లలు..పెద్దస్థాయికి ఎదిగినవారు కూడా కొల్లలుగానే ఉన్నారు. హాస్టల్ పిల్లలు జీవితాంతం ఆ మంచివాళ్ళని గుర్తుపెట్టుకునే ఉంటారు. ఏదేమైనా హాస్టళ్లలో నిత్యపర్యవేక్షణ అత్యవసరం. పర్యవేక్షణ లోపం.. హాస్టళ్లకు ఒక పెద్ద శాపం. 'తినేదానికి తిండిలేని వారికి సౌకర్యాలు కావాల్నా?'.. అన్నట్లు చులకనభావంతో ఉంటారు నిర్వాహకులు. కానీ, ఆ పేదపిల్లలకు ప్రభుత్వం కేటాయించిన ఆ మొత్తాలనే మిగలబెట్టుకుని చాటుగా మెక్కేస్తుంటారు. కొన్నిచోట్ల అధికారులు సైతం వాటాలేసుకుని ఆ డబ్బును ఆరగించేస్తుంటారన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట. అడిగేవారు లేకపోవడం, హాస్టళ్లలో నిర్వాహకులు ఏం చేస్తున్నారని అనునిత్యం గమనించే వ్యవస్థ లేకపోవడంతో ఏళ్ల తరబడిగా వాళ్ల ఆడింది ఆటగా, పాడింది పాటగా ఉంటోంది. ఎంతకాలమిలా?.. వసతులు లేని వసతిగృహాల్లో పిల్లల అలా బాధలు పడాల్సిందేనా?.. ఈ పరిస్థితులు ఇకనైనా మారాలి. హాస్టళ్ల వార్డెన్లు, వంటవాళ్ళు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులకు పెట్టే ఆహారం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పిల్లలకు సక్రమంగా అందేలా చూడాలి! కనీసం మానవత్వం కూడా లేకుండా కుళ్ళిన కోడిగుడ్లు, పాసిపోయిన అన్నం పెట్టడం వంటివి ఎంత ఘోరం?..అది పాపం కూడా. ప్రభుత్వం వీటిపై మరింత కఠినంగా వ్యవహరించాలి. నిజాయితీ గల విశ్రాంత అధికారులను, పోలీసులను కలిపి ఒక 'టాస్క్‌ఫోర్స్'గా ఏర్పాటుచేసి, నిత్యం ఆకస్మిక తనిఖీలు చేస్తే తప్ప..హాస్టళ్లలో నిర్లక్ష్యానికి, లోగుట్టుగానే సాగిపోతున్న అక్రమాలకు.. అవినీతి మాయాజాలానికి అంతం ఉండదు.

- సంచారి

# వేలం వెర్రిగా ఫ్లెక్సీల జాతర.. సామాజిక విలువలకు పాతర!

ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధిస్తామని చెపుతూనే గడువు పొడిగించుకుంటూ వస్తోంది. రోజురోజుకి ఈ ఫ్లెక్సీల బెడద ఎక్కువవుతూ ఉంది. తమ నాయకుడి ఇంట్లో కుక్క పుట్టినరోజుకి కూడా ఫ్లెక్సీలు కడుతున్నారు. ఇటీవల నెల్లూరు నగరంలో అన్నమయ్య సర్కిల్ వద్ద ఒక హోటల్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభ వేడుకకు పెద్దతెర, బుల్లి తెర తారలను ఓ పదిమందికిపైగా పిలిచి తమ పలుకుబడిని, అభిరుచిని చాటుకున్నారు నిర్వాహకులు. అంతా బాగానే ఉంది. వాళ్ళ సంస్థ వాళ్ళ ఇష్టం. కానీ తమ ప్రారంభోత్సవ ప్రచారంలో భాగంగా అన్నమయ్య చుట్టూ అమ్మాయిల ఫ్లెక్సీలు కట్టి తమ లేకిబుద్ధి చూపించారు. అన్నమయ్య సర్కిల్‌లో ప్రారంభోత్సవం చేసుకునేవాళ్ళకు అన్నమయ్యను గౌరవించడం కూడా చేత కాలేదు. ప్రారంభోత్సవం రోజు కూడా జనం వేలంవెర్రిగా వచ్చి విగ్రహం చుట్టూ ఉన్న పచ్చని చెట్లను, లాన్‌ని తొక్కి నాశనం చేసేశారు. అక్కడున్న ట్రాఫిక్ సైన్‌బోర్డులను కూడా విరగ్గొట్టారు. వీపీఆర్ గారి చొరవతో అన్నమయ్య విగ్రహ ఐలాండ్ అందంగా మెయిన్‌టైన్ చేస్తున్నారు. ప్రచారం కోసం ప్రారంభోత్సవ ఆర్భాటం చేసిన ఈ హోటల్ యాజమాన్యానికి అన్నమయ్య విగ్రహం ఉన్న ఆధ్యాత్మిక ప్రదేశాన్ని కాపాడుకోవాలన్న కనీస సామాజిక బాధ్యత కూడా లేకపోవడం దురదృష్టకరం.

ఆర్. పి. రామయ్య, కొండాయపాలెం.




lawyerpatrika@gmail.com
+91 98663 14741

# సూపర్‌స్టార్ కృష్ణ పేరుతో.. జాతీయ అవార్డును నెలకొల్పాలి

సూపర్‌స్టార్ కృష్ణ పేరుతో ప్రభుత్వం 'జాతీయ అవార్డు'ను ఏర్పాటుచేస్తే బాగుంటుంది. ప్రతిఏటా రాష్ట్రప్రభుత్వం చలనచిత్ర రంగానికి సంబంధించి నంది అవార్డులు, నాగిరెడ్డి పురస్కారం, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు, పురస్కారాలు అందజేస్తున్న నేపథ్యంలో, అదేవిధంగా ప్రఖ్యాత హీరో కృష్ణ పేరుతో జాతీయ అవార్డు నెలకొల్పి, సినీరంగంలో లబ్ధప్రతిష్టులకు ఆ అవార్డును బహూకరించాలని విజ్ఞప్తి. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు అంతర్జాతీయస్థాయి కీర్తి తెచ్చిన మహానటుడు కృష్ణ తెలుగు సినీరంగంలో ఎన్నో ప్రయోగాలు చేసి, ఆ చిత్రాల ద్వారా తెలుగుప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. మన్యం యోధుడు అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని నిర్మించి రామరాజు ఆ విధంగా ఉంటాడా అనే రీతిలో తెలుగువారిని మెప్పించిన కృష్ణ, ఎన్టీఆర్-ఏఎన్నార్‌లకు ధీటుగా వారితో పోటీపడి చిత్రపరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు. చిత్ర పరిశ్రమకు ఎన్టీఆర్-ఏఎన్నార్‌లు రెండు కళ్లు అని ప్రచారంలో ఉన్నప్పుడు, వారు కళ్లైతే తాను మెదడునని సగర్వంగా చెప్పిన అభిమానధనుడు.. సూపర్‌స్టార్ కృష్ణ. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచేందుకు ఆయన పేరుతో జాతీయ అవార్డు నెలకొల్పడం సముచితం.

డా. ఎస్.బాబూరావు, కావలి.

# 'నక్షత్ర' స్కూల్లో..లైంగిక వేధింపులు

- 8వ తరగతి విద్యార్థినిపై అకృత్యాలు
- నగరంలో వెల్లువెత్తుతున్న నిరసనలు

**నెల్లూరులో కొన్ని ప్రైవేట్‌స్కూళ్లలో అమాయకులైన బాలికలపై జరుగుతున్న లైంగిక అకృత్యాలు ప్రజల్లో ఆ స్కూళ్ళ పట్ల అసహ్యాన్ని, ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. స్కూళ్ళకు తమ పిల్లలను పంపి, వారికి వేలాదిరూపాయల ఫీజులు కట్టి, ఆ స్కూళ్ళను పోషిస్తున్న వారి బిడ్డలపైనే నిర్వాహకులు ఇంతటి అఘాయిత్యాలకు పాల్పడడం ఘోరం.. దారుణం!. సిగ్గుఎగ్గూ లేకుండా, కనీసం మానవత్వం అనేది కూడా లేకుండా బరితెగించి చిన్నారులపై ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతున్నవారిపై, నిర్లక్ష్యంగా ఉంటున్న ఆ స్కూళ్ళ నిర్వాహకులపై పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకోవాలంటూ తల్లితండ్రులతో పాటు విద్యార్థిసంఘాలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.**

### 'నక్షత్ర'లోనూ ఇదే తంతు :

మొన్నటికి మొన్న ఓవెల్ స్కూల్‌లో ఓ చిన్నారిపై లైంగిక వేధింపులు జరగడం తెలిసిందే. ఆ సంఘటన నుంచి ప్రజలు కోలుకోకముందే ఇప్పుడు మళ్ళీ మాగుంట లేఅవుట్‌లోని 'నక్షత్ర' స్కూల్‌లో ఓ 8వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపుల వ్యవహారం బట్టబయలైంది. ఆ స్కూల్ కరెస్పాండెంట్, బస్సు డ్రైవర్ ఆ బాలికపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ బాలిక తల్లితండ్రులు, బంధువులు ఆగ్రహంతో ఈనెల 2న స్కూల్ ముందు ఆందోళన చేశారు. చీటీ పెట్టి పరీక్ష రాస్తూ పట్టుబడిందంటూ తమ బిడ్డపై రకరకాల వేధింపులకు దిగారని, ఆ వేధింపులు తట్టుకోలేక తమ బిడ్డ స్కూల్‌లో తనపై జరుగుతున్న లైంగిక వేధింపులను చెప్పి రోదిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆ స్కూల్ కరెస్పాండెంట్ జీవన్, డ్రైవర్ మహేష్‌లపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### విద్యార్థి సంఘాల ఆగ్రహం

నక్షత్ర స్కూల్‌లో బాలికను లైంగికంగా వేధించడం పట్ల నెల్లూరులోని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఆ స్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, నిందితులను అరెస్ట్ చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఏపి విద్యార్థి జేఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి, నవ్యాంధ్ర జేఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలామోహన్ తదితరులు డిమాండ్ చేశారు. నక్షత్ర స్కూల్‌ను రద్దుచేయాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ, ఏపిఎస్‌యు, సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసి సంఘాల నాయకులంతా పెద్దఎత్తున ఆందోళన చేశారు.

### మండిపడ్డ కాకాణి

ఈ ఘటనపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదని, వెంటనే డిఎస్పీ స్థాయి అధికారితో సమగ్ర విచారణ జరిపించి నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. విచారణ జరిపి, నిజనిజాలను వెలికితీసి నిందితులపై తగుచర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

### నక్షత్ర ఘటనపై 'ఫోక్సో' కేసు :

బాధిత విద్యార్థిని తల్లి చేసిన ఫిర్యాదుతో రంగంలోకి దిగి, విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆ స్కూల్ కరెస్పాండెంట్ జీవన్‌కృష్ణ, బస్సు డ్రైవర్ మహేష్‌లపై బాలాజీనగర్ పోలీసులు ఈనెల 3న 'ఫోక్సో' కేసు నమోదు చేశారు. నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

# జీఓ నం.167ను వెంటనే రద్దు చేయాలి

**--- ఏబిఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర కన్వీనర్ ప్రొ.వైవి రామిరెడ్డి ---**

విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకాన్ని నిషేధిస్తూ విడుదల చేసిన జీఓ నం.167ను వెంటనే రద్దుచేయాలని అఖిలభారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొ.వైవి రామిరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, అడ్‌హాక్, గెస్ట్, అకడమిక్ కన్సల్టెంట్ మొదలైన నియామకాలను ప్రభుత్వం నిషేధిస్తూ ఉత్తర్వులివ్వడం వల్ల బోధన కుంటుపడుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని 16 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 60 నుండి 70 శాతం అధ్యాపక పోస్టులు సుమారు నాలుగువేల దాకా ఖాళీగానే ఉన్నాయని, 2007వ సంవత్సరం తర్వాత రాష్ట్రంలోని ఏ విశ్వవిద్యాలయంలో కూడా శాశ్వత అధ్యాపక నియామకాలు జరగలేదని, అనేక విభాగాల్లో శాశ్వత అధ్యాపకులు లేకపోవడంతో తాత్కాలిక అధ్యాకులతోనే బోధన జరుగుతోందని ఆయన తెలిపారు. ఇప్పటిదాకా విశ్వవిద్యాలయాలు అవసరాన్ని బట్టి వివిధ సబ్జెక్టులలో అర్హతలు ఉన్న తాత్కాలిక అధ్యాపకులను నియమించుకుని బోధన సాగిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో ఆ నియామకాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడ వల్ల విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసినట్లయిందని, తద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య దూరమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఏపిపిజిసిఇటి ద్వారా ప్రవేశాలు పొందిన మొదటిసంవత్సరం పీజీలో చేరిన కొత్త విద్యార్థులు ఈనెల 5 వ తేది నుంచి యూనివర్శిటీలకు వస్తున్న తరుణంలో ఇలాంటి ఉత్తర్వులు రావడం వల్ల బోధనలో ప్రమాణాలు కొరవడుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయాలపై దృష్టిపెట్టి యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల నియామకానికి వెంటనే చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట తాత్కాలిక అధ్యాపకుల నియామకాల కోసం విశ్వవిద్యాలయాలకు పూర్తిస్వేచ్ఛను ఇవ్వాలని ఆయన కోరారు.

# పోర్టుకు భూములిచ్చినవారికి పునరావాసం

రాష్ట్రానికి ప్రఖ్యాతిని తెచ్చే ప్రాజెక్టుల్లో రామాయపట్నం పోర్టు ముందువరుసలో ఉంటుందని, పోర్టు ఏర్పాటుకు భూములిచ్చిన కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉండి వారికి మెరుగైన పునరావాస వసతులు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఇటీవల కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు మండలం రామాయపట్నం పోర్టు భూనిర్వాసిత కుటుంబాలకు పునరావాస సహాయ కార్యక్రమాల్లో భాగంగా రామాయపట్నం సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీకి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు ఏర్పాటుతో వ్యవసాయ, మైనింగ్ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు అనుకూలంగా ఉండి, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తాయన్నారు. ఒక వైపు కృష్ణపట్నం పోర్టు, మరో వైపు రామాయపట్నం పోర్టు ఏర్పాటుతో పారిశ్రామికంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. రామాయపట్నం పోర్ట్ ఏర్పాటుకు మొండివారిపాళెం, ఆవులపాళెం, రావులపాళెం, కర్లపాళెం గ్రామాల ప్రజల సహకారం మరువలేనిదని, ఈ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. న్యాయపరంగా నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందిస్తున్నామని చెప్పారు. ఈ కాలనీలో నిర్వాసితులు అందరూ ఇళ్లు నిర్మించుకొని త్వరగా గృహప్రవేశాలు చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పోర్టు నిర్వాసిత గ్రామాల ప్రజలకు చెప్పిన మాటకు కట్టుబడి నూరు శాతం హామీలు నెరవేరుస్తున్నామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కందుకూరు



శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాధ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక మాట్లాడుతూ, రామాయపట్నం పోర్టును 2023 డిసెంబర్ లోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తునట్లు చెప్పారు. 850 ఎకరాల భూసేకరణకు సంబంధించి ఇప్పటివరకు 450 ఎకరాలు భూసేకరణ పూర్తయిందన్నారు. అనంతరం మొండివారి పాలెంకు చెందిన 111 కుటుంబాలకు సుమారు రూ. 22 కోట్ల 49 లక్షల విలువైన భూనష్టపరిహార చెక్కులను, ఇంటి నివేశ పట్టాలను జిల్లా కలెక్టర్, కందుకూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. తొలుత ఆర్ అండ్ ఆర్ కాలనీలో రామాలయ నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. రామాయపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐ.వెంకటేశ్వరరెడ్డి, గుడ్లూరు తహశీల్దార్ లావణ్య, ఎంపీపీ రమేష్, గ్రామ కాపు పోలయ్య, పోర్టు నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## డా.అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ఉద్యమిస్తాం

**- ఎస్సీఎస్టీల సంక్షేమసంఘం -**



రాజ్యాంగనిర్మాత, మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కోరుకున్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వం అనే మాటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని అఖిలభారత దళిత గిరిజనుల సంక్షేమసంఘం నెల్లూరు ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్యపల్లి దాసు ఆవేదన వ్యక్తం చేశారు. డా.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 6న నెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా ప్రభుత్వాలు డా.అంబేద్కర్ ఆశయాలను, ఉద్దేశాలను నీరుకారుస్తూ, దళిత, బహుజన, మైనార్టీ వర్గాల వారికి అన్యాయం చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. ఈ అన్యాయాలను తమ సంఘం ఖండిస్తోందని, డా.అంబేద్కర్ ఆశయాల సాధనకోసం ఉద్యమిస్తామని ఆయన పేర్కొన్నారు.

# బోగస్ ఓటర్లను తొలగించండి

**ఎమ్మెల్సీ విఠపు డిమాండ్**

ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికకు సంబంధించి కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడుతున్నాయని, జిల్లా ఉన్నతాధికారులు వాటిని వెంటనే పరిశీలించి బోగస్ ఓటర్లను తొలగించాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈనెల 3న నెల్లూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారంగా ఓటర్లను నమోదు చేస్తున్నారని, నిబంధనల మేరకు పోర్టల్స్‌లోని వివరాలతో సరిచూసి, సరిగా లేని ఉపాధ్యాయుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. బోగస్ ఓటర్లను నమోదు చేస్తున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## గొలగమూడి వెంకయ్యస్వామి వైద్యశాలలో..

# ఉచితంగా వైద్యసేవలు



వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో కొలువైవున్న అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమంలో కొత్తగా నిర్మించిన ఆసుపత్రిలో ప్రతి రోజు ఉచితంగా వైద్యసేవలందిస్తున్నారు. ఆశ్రమం వారు నిర్వహిస్తున్న సామాజిక సేవలో భాగంగా ఈ ఆసుపత్రిలో ప్రముఖ వైద్యులతో రోగులను పరీక్షించి వైద్యసేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అల్లోపతి వైద్యం, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందిస్తున్నామని ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని 'బర్డ్' హాస్పిటల్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ప్రతి నెలా రెండుసార్లు గొలగమూడిలో ఉచిత వైద్యసేవలందిస్తారని, ఆయన అపాయింట్‌మెంట్ కోరుకునేవారు 63054 18947 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఆయుర్వేద వైద్యం, ఆయుర్వేద ఆయిల్ థెరపీ సేవలను ఆయుర్వేదంలో ఎం.డి చేసిన డాక్టర్ చక్రపాణి అందజేస్తారని, ఆదివారం మినహా ప్రతిరోజు మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఆయన అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రతి శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇఎన్‌టి (చెవి, ముక్కు, గొంతు) వైద్యులు ఎం.ఆదినారాయణరెడ్డి వైద్యసేవలందిస్తారని తెలిపారు. ప్రతి ఆదివారం డాక్టర్ బి.కృష్ణమూర్తి (మోడరన్ కంటి ఆసుపత్రి) ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటిపరీక్షలు నిర్వహిస్తారని ఆయన వివరించారు. ప్రతినెలా ఆదివారం రోజుల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వివిధ వైద్య నిపుణులు తమ సేవలందిస్తారని, మొదటి ఆదివారం డాక్టర్ వివేక్ (ఎం.డి-జనరల్ మెడిసిన్), రెండవ ఆదివారం రోజున చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పి.రవీంద్రబాబు, మూడవ ఆదివారం నాడు చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ కెఎస్ రాజు, నాల్గవ ఆదివారం సర్జికల్ స్పెషలిస్టు డాక్టర్ టి.రమణయ్య వైద్యసేవలందిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# నెల్లూరు కబుర్లు

## మహనీయులు.. డా. అంబేద్కర్

### - విపిఆర్ నివాళి



సమాజంలోని అసమానతలు రూపుమాపడానికి, అందరికీ సామాజిక న్యాయం, సమాన హక్కులు వర్తించేలా రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా డిసెంబరు 6న నెల్లూరులోని తమ నివాసంలో డా. అంబేద్కర్ చిత్రపటానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా పోరాడిన డా. అంబేద్కర్ చిరస్మరణీయులని పేర్కొన్నారు.

## గొప్ప మేధావి - కలెక్టర్



ప్రపంచం మొత్తం గర్వించదగిన అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని మనకు అందించిన గొప్ప మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కొనియాడారు. డిసెంబరు 6న కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ చక్రవర్తితో కలసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలో ప్రతి ఒక్కరికి పుట్టుకతోనే అన్ని హక్కులు కల్పించాలనే గొప్ప సంకల్పంతో డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కలెక్టర్ కోరారు.

## ఘనంగా 'గీతా జయంతి'



నెల్లూరు దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణయోగ మందిరంలో ఈనెల 4న 'గీతా జయంతి' వేడుకగా జరిగింది. గీతా వైభవ్ ట్రస్ట్ ఛైర్మెన్ నజీర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొని భగవద్గీత శ్లోకాలను పారాయణం చేశారు. 40 శ్లోకాల గీతా చాలీసా, 108శ్లోకాల గీతా అష్టోత్తర శత శ్లోకావళి సామూహిక కంఠస్థ పారాయణం జరిగింది. తొలుత టిటిడి కల్యాణమండపం నుంచి శ్రీకృష్ణ యోగమందిరం వరకు విద్యార్థులు భగవద్గీత నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు విద్యార్థులకు బహుమతులందజేశారు. భగవద్గీత గ్రంథంలోని శ్లోకాలను నేర్చుకుని, అవగాహన చేసుకోవడం ద్వారా ప్రతిఒక్కరి జీవితానికి సార్థకత చేకూరుతుందని నజీర్‌బాషా ఈ సందర్భంగా చెప్పారు. అన్నదాత మణి, కృష్ణచైతన్య విద్యాసంస్థల అధినేత చంద్రశేఖర్‌రెడ్డి, రామాయణం మహేష్‌స్వామి, ప్రణవాత్మానంద సరస్వతి, ఉమా గంగాధర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసగుప్తా తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టులకు అన్నివిధాలా సహకరిస్తాం

### - నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

జర్నలిస్టులకు అన్ని విధాల సహకరిస్తామని నెల్లూరు రూరల్ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. బుధవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో మెడికవర్ ఆసుపత్రి అందించిన జర్నలిస్టుల రాయితీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని, వారికి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం చంద్రశేఖర్, మెడికవర్ వైద్యశాల జోనల్ ఇన్‌చార్జి మహేశ్వరరెడ్డి, నెల్లూరు ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్, 'సామ్నా' అధ్యక్ష కార్యదర్శులు సర్వేపల్లి రామ్మూర్తి, జి.అనోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్పాస్టిక్‌సెంటర్‌లో.. దివ్యాంగుల దినోత్సవం




అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 3న నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీ, ఎంఎస్‌ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో చిన్నారులకు ఆటల పోటీలు పెట్టి బహుమతులిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా లోక్ అదాలత్ సీనియర్ సివిల్ జడ్జి మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసనాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, వారికున్న హక్కుల పట్ల అవగాహన కలిగించారు. రెడ్‌క్రాస్ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. స్పాస్టిక్స్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత మధ్యాహ్న భోజన పథకం, ఉచిత రవాణా సేవలు వగైరాలన్నీ రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ ఎంవి సుబ్బారెడ్డిల నేతృత్వంలో ఏ కొరత లేకుండా జరుగుతున్నాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ గురునాథరావు చెప్పారు. కన్వీనర్ వెంకురెడ్డి, తలసేమియా కో-కన్వీనర్ పర్వీన్, స్పాస్టిక్ మెంబర్ అరుణమ్మ, సెక్రటరీ మస్తానయ్య, చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఆటల పోటీల్లో విజేతలైన చిన్నారులకు సీనియర్ సివిల్ జడ్జి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

## ఇన్‌చార్జి డిపిఓగా..జడ్పీ సిఇఓ

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఇటీవలే అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తాజాగా జడ్పీ సిఇఓ బి.చిరంజీవిని నియమించారు. ఆ మేరకు ఆయన ఈనెల 3న ఇన్‌చార్జి డిపిఓగా బాధ్యతలు స్వీకరించారు.

## పోలీసులకు ధీటుగా హోంగార్డుల సేవలు

### అభినందించిన జిల్లా ఎస్పీ



శాంతి భద్రతల పరిరక్షణతో పాటు వివిధ విభాగాల్లో హోంగార్డులు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు అభినందించారు. ఈనెల 6వ నెల్లూరులోని పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన 60వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ మాట్లాడారు. పోలీసుశాఖలో హోంగార్డులు అంతర్భాగమని, పోలీసులకు ధీటుగా వారు కూడా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. హోంగార్డ్స్ ఆర్‌ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 723 మంది హోంగార్డులు ఉన్నారని, వారి సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారికి నెలసరి వేతనాన్ని 18 నుంచి 21వేల రూపాయలకు పెంచిందని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమసేవలందించిన సౌత్‌ట్రాఫిక్ హోంగార్డు జి.అశ్విన్, వి.ప్రభాకర్, జి.శ్రీకాంత్, జి.మోహన్, ఏ.శ్యాంసన్, ఆర్.సతీష్‌కుమార్, వి.అరుణ, పి.రమణమ్మ, షేక్ షర్మిల తదితరులను ఎస్పీ అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఏఎస్పీ హిమవతి, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి

### కేవీ చలమయ్య విజ్ఞప్తి



ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని నెల్లూరులో ఏర్పాటుచేయాలని ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు కేవీ చలమయ్య విజ్ఞప్తి చేశారు. రోశయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రోశయ్యతో గల స్నేహ సంబంధాలను గుర్తు చేశారు. 2008లో నెల్లూరుజిల్లాను పొట్టి శ్రీరాములు జిల్లాగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్పొరేషన్‌లో ప్రత్యేక తీర్మానంపెట్టి, రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. సంఘం నేతలు ఆర్.వి శరత్‌చంద్ర, నేత్ర వైద్యులు డా.రవీంద్రనాథ్, సొల్లేటి కోటేశ్వరరావు, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు కళ్యాణ చక్రవర్తి, నరసింహారావు పేర్ల జనార్ధన్, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.






## ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో అక్రమాలు

### సిపిఎం ధర్నాందోళన

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లలో అక్రమాలు జరుగుతున్నాయంటూ సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో ఈనెల5న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, ఆ అక్రమాలను నిరోధించాలంటూ కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ ఓట్లలో అనర్హులైన వారిని కూడా చేరుస్తున్నారని, ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకులు ఎం.మోహన్‌రావు, కత్తి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వి.రామరాజు, డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు నరసింహ, వెంకటరమణ పాల్గొన్నారు.






## పర్యావరణ పరిరక్షణకు..

# ప్రభుత్వ కృషి అమోఘం

**- శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి**

సమర్థవంతమైన పర్యావరణ నిర్వహణతో ఆర్థికవృద్ధిని పెంపొందించాలనే దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషిచేస్తోందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. ఘనవ్యర్థాల సుస్థిర నిర్వహణపై తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన 12వ అంతర్జాతీయ సదస్సులో, శ్రీసిటీ పర్యావరణ విభాగానికి చెందిన పరిశ్రమల వారు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. 51 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్న ఈ నాలుగు రోజుల సదస్సును ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పర్యవేక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ కోసం తగిన ప్రామాణిక విధానాలతో (ఎస్ఓపి) ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థను నిర్వహించేందుకై ప్రత్యేకంగా ఓ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు రాష్ట్రప్రభుత్వాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. దేశంలో మొట్టమొదటి కార్బన్-న్యూట్రల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌గా గుర్తింపు పొందాలన్న లక్ష్యానికి అనుగుణంగా, శ్రీసిటీ వినూత్నమైన హరిత కార్యక్రమాలను అవలంబించి అమలుపరుస్తున్నదని, స్థిరమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థతో ఈ బహుళ పారిశ్రామిక వస్తు ఉత్పత్తుల నగరం దేశంలోనే ప్రముఖమైన వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీసిటీ పర్యావరణ విభాగం అధికారి డా. పి.వెంకటేశ్వరన్ తమ ప్రసంగంలో వివరించారు. ఇసుజు, భారత్ ఎఫ్.ఐ. హెచ్(ఫాక్స్‌కాన్), టోరే, బ్లూస్టార్, కెలాగ్స్, బ్రేక్స్ ఇండియా, ఎన్.ఎస్. ఇన్స్ట్రుమెంట్స్ , మాండెలెజ్ (కాడ్బరీస్), మరియూ హామిల్టన్ వంటి వివిధ పరిశ్రమల ప్రతినిధులు ఆయా పరిశ్రమలు అమలుచేస్తున్న పటిష్ట పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ, సమగ్ర ఘన వ్యర్థాల సేకరణ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సురక్షితంగా తరలించి డిస్పోజ్ చేయటం వంటి అంశాలపై వారు వివరణాత్మక ప్రసంగం చేశారు. తరువాత జరిగిన ప్యానెల్ చర్చల్లో వారంతా పాల్గొనారు. శ్రీసిటీ చేపడుతున్న చురుకైన సుస్థిర చర్యల ఫలితంగా ఇతర పారిశ్రామికవాడలకు ఓ మోడల్‌గా పరిగణింప బడుతుందని ఈ సదస్సులో పాల్గొన్న పలువురు ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# ప్రాచీన గ్రంథాలను కాపాడుకోవాలి



తెలుగు భాష, సంస్కృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నూతన డైరెక్టర్ డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్ అన్నారు. ఈనెల 5న వెంకటాచలం మండలంలోని అధ్యయన కేంద్రం కార్యాలయంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు, ప్రపంచంలో అతి ప్రాచీన భాష తెలుగని, ఎంతో విశిష్టమైన పద్యాలతో పాటు మధురమైన కావ్యాలెన్నో తెలుగుభాషలో ఉన్నాయని అన్నారు. తెలుగు సాహిత్యంలోని ప్రాచీన గ్రంథాలను కాపాడుకోవాలని, యువతరాన్ని, భావితరాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. అందుకోసం తమ సంస్థ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు నెల్లూరు రచయితలు తాము రాసిన పుస్తకాలను అధ్యయన కేంద్రానికి అందజేశారు. అనంతరం నెరసం తరపున సంపత్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెరసం అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ప్రముఖ కవులు వేదం సూర్యప్రకాష్, మోహన్‌రాజు, డిటి హరికృష్ణ, సయ్యద్ నజ్మా, గౌరీ తదితరులు పాల్గొన్నారు.






# పెంచలకోనలో అన్నదానానికి.. 'విద్యాదాత' కెవి రత్నం విరాళం



జిల్లాలోని ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన, రాపూరు మండలం పెంచలకోనలో కొలువైవున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శాశ్వత అన్నదాన పథకానికి ఇటీవల నెల్లూరులోని ప్రముఖ విద్యాదాత, రత్నం విద్యాసంస్థల ఛైర్మెన్ కె.వి.రత్నం - శ్రీమతి పద్మావతి రత్నం దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. అదేవిధంగా స్వామివారికి 5లక్షల రూపాయల విలువైన 78.600గ్రాముల లక్ష్మీ కాసుల హారాన్ని సమర్పించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకట సుబ్బయ్యలకు వాటిని అందజేశారు. తొలుత ఆ దంపతులిద్దరూ ఆలయంలో స్వామివారికి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు గౌరవపూర్వకంగా ఆలయ మర్యాదలతో స్వాగతించి శ్రీవార్ల చిత్రపటాన్ని అందజేయగా, ఆలయ అర్చకులు దాతలకు ఆశీస్సులందజేశారు.

# పర్యావరణ పరిరక్షణకు.. కృష్ణపట్నం పోర్టు కృషి

పర్యావరణ పరిరక్షణ కోసం ఆదాని కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అభినందించారు. ఈనెల 2న ఆయన పోర్టును సందర్శించి మొక్కలు నాటారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంలో భాగంగా, 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమాన్ని అనుసరిస్తూ పోర్టు వారు ఒకరోజున వెయ్యి మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి, మొక్కలు నాటడాన్ని ఆయన అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో కృష్ణపట్నం పోర్టు అగ్రస్థానంలో ఉందని ఆయన అంటూ, పారిశ్రామికంగానే కాక పర్యావరణ పరంగా కూడా పోర్టు యాజమాన్యం శ్రద్ధ తీసుకోవడాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని అన్నారు. జిల్లాలోని అటవీ ప్రాంతం అభివృద్ధికి అందరి కృషి అవసరమన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కాలుష్య నివారణ అందరి బాధ్యత అని చెప్పారు. జిల్లాలో ఏడాదిలో 26 లక్షల మొక్కలు నాటాలని




పిలుపునిచ్చారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు అందరూ కలసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అందరం మొక్కలు నాటుదామంటూ పోర్టు అధికారులు, ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. మోహిత్ షెకావత్, అడ్మిన్‌హెడ్ గణేశ్‌శర్మ, అశోక్ కుమార్‌మిశ్రా, వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఆర్ డిజిఎం శ్రీనివాస్, పిసిబి ఇఇ రాజశేఖర్, ఫైనాన్స్ హెడ్ శ్రీకాంత్ తదితర విభాగాధిపతులు పాల్గొన్నారు.

# 'గురుచరిత్ర' పఠనం.. పుణ్యప్రదం

'గురుచరిత్ర' ఎంతో విశిష్టమైన గ్రంథమని, ఆ గ్రంథాన్ని పఠించడం పుణ్యప్రదమని గురుచరిత్ర ప్రవచకురాలు ఆడిదం వేదవతి అన్నారు. దత్తజయంతి ఉత్సవాల్లో భాగంగా నవంబరు 30వ తేదీ నుండి నెల్లూరు టౌన్‌హాలులో శ్రీ సాయిభరద్వాజ సత్సంగ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 'గురుచరిత్ర' దశమ ప్రవచన మహాయజ్ఞం ఈనెల 6తో ముగిసింది. ఈ సందర్భంగా గురుదేవులు ఎక్కిరాల భరద్వాజ పుత్రిక వేదవతి గురుచరిత్ర ప్రవచనం చేసి, భక్తాదులకు ఆ గ్రంథం విశిష్టతను వివరించారు.

# 'తంగిరాల మహాభారతం' 33వ భాగం




భరద్వాజ మహర్షి ఒకనాడు ఘృతాచి అనే దేవకన్యను చూసి స్ఖలనం చేసుకుంటాడు. దాన్ని ద్రోణ అనే కుండలోపెట్టి భద్ర పరుస్తాడు. తర్వాత ఆ కుండలోంచి ద్రోణుడు పుడతాడు. భరద్వాజ మహర్షి స్నేహితుడు వృషత మహారాజు కూడా పక్క ఆశ్రమంలో తపస్సు చేసుకుంటాడు. ఒకరోజు అతను మేనకని చూసి వీర్య స్ఖలనం చేసుకుంటాడు. అప్పుడు అతనికి ద్రుపదుడు పుడతాడు. వృషత మహారాజు, ద్రుపదుని భరద్వాజ మహర్షి దగ్గర ఉంచి, రాజ్యానికి వెళ్ళిపోతాడు. ద్రోణుడు, ద్రుపదుడు కలిసి చదువుకుంటారు. వృషత మహారాజు చనిపోగానే, ద్రుపదుడు వెళ్ళిపోయి రాజ్యాన్ని చూసుకుంటాడు.

ద్రోణుడు కృపిని వివాహం చేసుకుని, అశ్వత్థామని కంటాడు. పరశురాముని దగ్గరకు వెళ్లి అనేక అస్త్ర, శస్త్రాలని పొందుతాడు. కాని, దారిద్ర్యంతో బాధ పడుతూ తన చిన్ననాటి స్నేహితుడు, ద్రుపద మహారాజు దగ్గరకివెళ్లి సహాయం చెయ్యమని అడిగినప్పుడు, ద్రుపదునిచే అవమానింపబడతాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## విఎస్‌యులో..
# అరుదైన కలువ మొక్కల సంరక్షణ




నెల్లూరులోని విఎస్‌యు (విక్రమసింహపురి విశ్వవిద్యాలయం) జాతీయ సేవా పథకం, కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలోని లీడ్ బొటానికల్ గార్డెన్ సంయుక్తంగా వివిధ రకాల ఔషధ మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా తొలిదశలో ఇటీవల కొన్ని అరుదైన కలువ మొక్కలను విఎస్‌యు ప్రాంగణంలో సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి రామచంద్రరెడ్డి నాలుగు రకాల కలువ మొక్కలను ప్రత్యేకంగా ఏర్పరచిన చెరువులో నాటారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ, అంతరించిపోయే వృక్ష జాతులను సంరక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యతని, మొక్కలు మనకు ఆహారంతో పాటు అనేక రకాలైన ఔషధాలను కూడా ప్రసాదిస్తున్నాయని అన్నారు. 'మన ఆహారమే మన ఔషధం' అని అందరూ అవగాహన చేసుకోవాలన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర ఆచార్యులు డా. ఎ.మధుసూదనరెడ్డి మాట్లాడుతూ, తమ విశ్వవిద్యాలయంలో ఉన్న లీడ్ బొటానికల్ గార్డెన్ అంతర్జాతీయంగా ప్రఖ్యాతి చెందిందని, ఎన్నో వందల వృక్షజాతుల మొక్కలను అక్కడ సంరక్షిస్తున్నామన్నారు. అదేవిధంగా ఇక్కడ కూడా అరుదైన మొక్కల సంరక్షణ చేపట్టడం ఒక మంచి పరిణామమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేపడతామని, అందుకు ప్రోత్సాహం ఇచ్చిన విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.యం.సుందరవల్లికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విఎస్‌యు ప్రిన్సిపాల్ ఆచార్య జి. విజయ ఆనందకుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్, ప్రోగ్రాం అధికారులు డా. కె.సునీత, డా. కె.విద్యాప్రభాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు
# అండగా ప్రభుత్వం

సమాజంలో మెరుగైన జీవనం సాగించడానికి విభిన్న ప్రతిభావంతులకు అన్ని విధాల ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ప్రతి ఒక్కరూ కూడా మానవతా దృక్పథంతో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు. ఈనెల 5న నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వైకల్య నిర్ధారణ వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో అయిదురోజుల పాటు వైకల్య నిర్ధారణ వైద్య శిబిరాలు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాలను అందించనున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతులందరూ తప్పనిసరిగా యుడిఐడి కార్డును పొందాలని, ఈ కార్డు ద్వారా ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్, అనేక సంక్షేమ పథకాలను పొందే వీలుందని ఆయన చెప్పారు. సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి నాగరాజు కుమారి, జడ్పీ సీఈవో చిరంజీవి, డిఆర్డీఏ, డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జడ్పీ పాఠశాల హెచ్ఎం ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## విద్యానగర్‌లో..
# ఎన్‌బికెఆర్ ఎన్‌సిసి కేడెట్ల ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆర్మీ, నేవీ ఎన్‌సిసి కేడెట్లు ఇటీవల విద్యానగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధికి దూరంగా ఉండాలంటూ విద్యార్థులు ప్లకార్డులను పట్టుకుని ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి లేదా ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధులని, ప్రజలు ఆ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరూ చెడువ్యసనాల జోలికి పోవద్దని హెచ్చరించారు. హెచ్ఐవి బాధితులను చులకనగా చూడకుండా వారి పట్ల ప్రజలు ఆదరంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆరిఫ్ అహ్మద్, ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ మాధవయ్య, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, శోభారాణి, ఎన్‌సిసి కేడెట్లు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# సచివాలయాల ఇన్‌చార్జిగా.. సాంబశివారెడ్డి

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి నోడల్ అధికారిగా డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డిని నియమిస్తూ ఈనెల 3న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులిచ్చారు. అదేవిధంగా 'స్పందన' అర్జీల నోడల్ అధికారిగా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సిపిఓ) సాలెంరాజును నియమించారు. కోవూరు మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పరిశ్రమల మేనేజర్ మారుతిప్రసాద్ నియమితులయ్యారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# వైకాపా గెలుపే లక్ష్యం

## రామ్‌కుమార్‌రెడ్డి



రాబోయే ఎన్నికల్లో తిరుపతి జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గాలు, ఎంపి స్థానాల్లో వైకాపా గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని తిరుపతి జిల్లా నూతన వైకాపా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల గూడూరు పట్టణంలోని సిఆర్ మార్టులో వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. స్వచ్ఛాంధ్ర, ఫైనాన్స్, సంగీత, నృత్య అకాడమీ రాష్ట్ర ఛైర్మన్‌లు పొణకా దేవసేనమ్మ, మేరిగ మురళీధర్, శిరీషాయాదవ్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిన విజయకుమార్, కనుమూరు హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నిత్యావసర వస్తువులు



గూడూరు, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళామండలి సహకారంతో ఈ నెల 5వ తేదీ 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర మహిళా మండలి మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ గౌరవాధ్యక్షురాలు డా. రోహిణి ముఖ్యఅతిథిగా పాల్గొనగా డా. తనూజ దాతగా వ్యవహరించారు. అలాగే రాజనేని శిరీష జన్మదినం సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లు, భోజనాలు ఏర్పాటు చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుప్రభ, కార్యదర్శి జీవనిరెడ్డి, విష్ణువందన, శశికళ, లక్ష్మీ, అనిత, శశిరేఖ, ఎం.లక్ష్మి, రెడ్ సంస్థ ప్రెసిడెంట్ జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాస ఆచారి, అస్లాం పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు ఘంటసాల



ప్రజల హృదయాల్లో ఘంటసాల వెంకటేశ్వరరావు చిరస్మరణీయుడుగా నిలిచిపోయారని ఘంటసాల స్వరాలయం సంస్థ నిర్వాహకులు గుండ్లపూడి శ్రీనివాసకుమార్, దువ్వూరు జనార్దన్ అన్నారు. గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఈ నెల 4వ తేదీ స్వరాలయ సంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి వేడుకలను నిర్వహించారు. గాయనీగాయకులు పాడిన ఘంటసాల పాటలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పలువురు పేదలకు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, శ్రీనివాసకుమార్‌లు దుప్పట్లు పంపిణీ చేశారు. గీత, రవితేజ, ఖాదర్ భాషా, వల్లి, సుబ్బారావు, శేగు ప్రసాద్, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 66వ వర్ధంతిని పురస్కరించుకుని అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు గూడూరు, అశోక్ నగర్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ దయవల్లనే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడిన రంగాల వారికి అవకాశాలు వస్తున్నాయని, ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వేగూరు రాజేంద్రప్రసాద్, చిరంజీవి, డాక్టర్ చంద్రహాస్, చంద్రశేఖర్, మనపాటి శ్రీను, ప్రతాప్, పామంజి మణి, శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి పోటీలకు లిటిల్ ఏంజెల్స్

నవంబరు 29, 30 తేదీలలో హైదరాబాద్, గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సిబిఎస్ఇ సౌత్‌జోన్ స్పోర్ట్స్ మీట్‌లో లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఘనంగా పతకాలను సాధించారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో పి.శ్రీనివాస భానుతేజ, ఎం.శ్రీనివాసులు, పి.హర్షిత్, ఇ.ఎస్.పాల్, బి.శ్యామ్ కృష్ణ బంగారు పతకాలను సాధించగా, పి.హర్షిత్ 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే లాంగ్‌జంప్‌లో ఇ.ఎస్.పాల్ వెండి పతకం, ఎం.సాగరిక అనే విద్యార్థిని లాంగ్‌జంప్‌లో వెండి పతకం, 200మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించింది. వీరిలో బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు జనవరిలో జరగబోయే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ నమశ్శివాయలు పిఇటి ఉపాధ్యాయులు రమేష్, సౌమ్య మరియు పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# శ్రీరామరక్షా కుటీరంలో శ్రీహనుమద్రవ్రతం



గూడూరు మాలవ్యానగర్‌లోని శ్రీరామరక్షా కుటీరం (కీ॥శే॥ శ్రీరామరక్షా పున్నారావు స్వగృహం)లో ఈ నెల 5వ తేదీ శ్రీరామరక్షా సేవాసంఘం ప్రతినిధులు చిట్టిబాబు, పవన్ దంపతులు 'శ్రీహనుమద్రవ్రతం' నిర్వహించారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ వారు ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఓర్వలేకే జగన్‌పై.. బాబు, పవన్ విమర్శలు

## • కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న ధ్వజం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌లు అనునిత్యం లేనిపోని విమర్శలు చేస్తున్నారని, ఎల్లోమీడియా కూడా అందుకు వత్తాసు పలుకుతూ ప్రజలను పక్కదారి పట్టించేదుకు ప్రయత్నాలు చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 5న ఆయన కోవూరు నియోజకవర్గంలోని గాదెలదిన్నెలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వంపై, జగన్‌పై విషప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వానికి ఎలాగైనాసరే చెడ్డపేరు తీసుకురావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాల్లో అవినీతి జరుగుతోం దన్న చంద్రబాబు ఆరోపణలు అర్థరహితమన్నారు. సిఎం బటన్‌నొక్కితో నేరుగా నిధులు లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరిపోతున్నాయని, ఇందులో అవినీతికి తావేలేదన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా సిఎం జగన్ పట్ల ఉన్న ప్రజాదరణ ఎప్పటికీ తగ్గదని స్పష్టంచేశారు. డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, జడ్పీటీసి తుమ్మల లక్ష్మయ్య, మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, సర్పంచ్‌లు తుమ్మల వెంకటేశ్వర్లు, రావెళ్ల మల్లికార్జునరావు, ఎంపీటీసీ భక్తవత్సలయ్య పాల్గొన్నారు.

## ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం..

# కొత్త డైరెక్టర్‌గా ఆచార్య మాడభూషి



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనం కేంద్రం నూతన సంచాలకులుగా ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఇప్పటిదాకా ఈ కేంద్రానికి ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేసిన ఆచార్య డి.మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై, ఆ సంస్థ నిర్వహించిన కార్యక్రమాల్ని వివరించారు. అనంతరం ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ, తనకు ఈ సదావకాశాన్ని కల్పించిన భారతీయ భాషా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తానని చెప్పారు. ఇక్కడ జరుగుతున్న పరిశోధనలు దశదిశలా వ్యాప్తికావాల్సిన అవసరం ఉంది. ఇంకా గొప్ప గొప్ప ప్రాజెక్టుల్ని చేయాల్సి ఉందని, దాని కోసం కృషి చేస్తానని తెలిపారు. మద్రాసు విశ్వవిద్యాలయం ఆచార్యులు విస్తాలి శంకర్‌రావు, కవి పెరుగు రామకృష్ణ, మద్రాస్ క్రిస్టియన్ కళాశాల అధ్యాపకులు ఆచార్య యజ్ఞశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 'చుక్కల భూముల' సమస్య తీరేదెప్పుడు?

## -- కావలిలో బాధితుల పోరాటకమిటీ ఆందోళన --





కాలం గడిచిపోతున్నా చుక్కల భూముల సమస్యలు మాత్రం తీరడం లేదని, ఈ సమస్యను తీర్చి భూముల యజమానులకు వాటిని విక్రయించుకునేందుకు స్వేచ్ఛను కల్పించాలని కావలిలోని జనతాపేట చుక్కల భూముల బాధితుల పోరాటకమిటీ కోరుతోంది. ఆమేరకు పోరాట కమిటీ కన్వీనర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలకొండ శారద, కో-కన్వీనర్లు కోటిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఈనెల 4న జరిగిన పోరాటకమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ఎప్పుడో 1954లో కొనుగోళ్ళు, అమ్మకాలు జరుగుతున్నప్పుడు చేసుకున్న ఇళ్లు, ఇళ్ళస్థలాల రిజిస్ట్రేషన్లను 2018లో చుక్కల భూముల (సమస్యాత్మక భూముల) జాబితాలో పెట్టారని, అయితే ఏళ్ళు గడుస్తున్నా ఆ సమస్యలు తీర్చకపోవడంతో తమ పరిస్థితి అయోమయంగా తయారైందని వారు పేర్కొన్నారు. అధికారులను ఎన్నిసార్లు కలసినా 'ఇదిగో అదిగో' అంటున్నారే తప్ప పరిష్కారం ఉండడం లేదని, ఇలా ఎంతకాలం గడవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత నవంబరు 15వ తేదీ లోపల అన్ని చుక్కల భూములను ఆ జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వం జిఓ ఇచ్చినా ఇక్కడి అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కావలి జనతాపేట నార్త్‌కు చెందిన భూములు కూడా ఈ చుక్కల భూముల జాబితాలో ఉన్నాయని, ఇకనైనా వాటిని త్వరగా పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఇడిమేపల్లికి ఎట్టకేలకు సాగునీరు

## ➢ కల సాకారమైందన్న మంత్రి కాకాణి



సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కనుపూరు కాలువ నుంచి ఇడిమేపల్లి చెరువుకు సాగునీరు అందించే కాలువ నిర్మాణాన్ని పూర్తిచేసి... ఆ ప్రాంత రైతాంగం దశాబ్దాల కలను నెరవేర్చడం ఎంతో ఆత్మ సంతృప్తినిచ్చిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన వెంకటాచలం మండలం ఇడిమేపల్లిలో కనుపూరు కాలువ నుంచి ఇడిమేపల్లి చెరువుకు సాగునీరు అందించే పంట కాలువను స్థానిక రైతులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుమారు ఐదారు దశాబ్దాలుగా ఇడిమేపల్లి, జంగాలపల్లి రైతులు సాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రధానంగా సన్న, చిన్నకారు రైతాంగం బాధలు వర్ణనాతీతమన్నారు. ప్రభుత్వపరంగా కాలువలను నిర్మించడంలో కొంత జాప్యం జరగడంతో ఎన్నికలకు ముందు రైతాంగానికి ఇచ్చిన మాటకు కట్టుబడి తన సొంత నిధులతో కనుపూరు కాలువ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర కాలువను రాత్రింబవళ్లు తవ్వించి సాగునీటిని ఇడిమేపల్లి చెరువుకు అందించామని, ఇక భవిష్యత్తులో కూడా సాగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపడం తనకెంతో ఆత్మ సంతృప్తినిచ్చిం దన్నారు. సర్వేపల్లి, కనుపూరు కాలువల ద్వారా ఇడిమేపల్లి చెరువుకు సాగునీరు అందడం ద్వారా ఈ ప్రాంతం లోనూ రెండు పంటలు పుష్కలంగా పండుతాయన్నారు. ఇటీవలే మనుబోలు మండలం రామదాసు కండ్రిక గ్రామ రైతాంగానికి సాగునీరు అందించామని, ఇప్పుడు ఇడిమేపల్లి, జంగాలపల్లి రైతులకు సాగునీరు అందించి వారి చిరకాల కోరిక తీర్చామన్నారు. రైతులకు సంబంధించి ఏ చిన్న సమస్య కూడా లేకుండా పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, సర్పంచ్ అనూష, నాయకులు మందల వెంకట శేషయ్య, కనుపూరు కోదండ రామిరెడ్డి, రఘునందనరెడ్డి లతో పాటు ఇడిమేపల్లి, జంగాలపల్లి రైతులు పాల్గొన్నారు.

## నేరాలు-ఘోరాలకు

# కేరాఫ్ అడ్రస్‌గా.. నెల్లూరు

**'జనసేన' మనుక్రాంత్**



ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరు ఇప్పుడు నేరాలకు-ఘోరాలకు నిలయంగా మారిందని, వాటిని నిరోధించాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ ఆరోపించారు. ఈనెల 5న నెల్లూరులోని జనసేన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగరంలోని ప్రైవేట్ స్కూళ్ళలో విద్యార్థినుల పట్ల లైంగిక దాడులు జరుగుతుండడం దారుణమన్నారు. నెల్లూరులోని ఓవెల్ స్కూల్‌లో నాల్గవ తరగతి చదువుతున్న చిన్నారిపై స్కూల్ పిఈటీ లైంగిక దాడికి పాల్పడడం, అదేవిధంగా నగరంలోని నక్షత్ర పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినిపై ఆ పాఠశాల కరెస్పాండెంట్, వ్యాన్‌డ్రైవర్‌లు లైంగికంగా వేధించడం వంటి ఘటనలు సభ్య సమాజానికే సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా నెల్లూరు పేరుప్రతిష్టలను దిగజారుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఈ ఘటనలను పూర్తిస్థాయిలో సమగ్రంగా విచారించి నిందితులకు కఠినశిక్షలు విధించాలన్నారు. ఈ సమావేశంలో జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, జిల్లా కార్యదర్శులు షేక్ ఆలియా, జి.హరి రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, సావిత్రి, శ్రీగౌరి, సుల్తాన్‌బాషా, శ్రీధర్, జీవన్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### కరేడులో.. విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలం కరేడులో కొలువైవున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరాలయంలో ఈనెల 4న రాహుకేతువులు, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యస్వామి తదితర దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వేడుకగా జరిగింది. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### కోవూరుపల్లిలో ఎయిడ్స్‌పై ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఇటీవల బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల-ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కోవూరుపల్లి పిహెచ్‌సి పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధికి అందరూ దూరంగా ఉండాలంటూ అవగాహన కలిగించారు. డెప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ బ్రిజిత, కోవూరుపల్లి పిహెచ్‌సి సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### సింగపేటలో సచివాలయం తనిఖీ

అల్లూరు నగరపంచాయతీలోని సింగపేటలోని సచివాలయాన్ని డెవలప్‌మెంట్ ఆఫీసర్ కనకదుర్గాభవాని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాల పట్ల సచివాలయ సిబ్బందికి అవగాహన కలిగించి, వాటి అమలుకు తగు సూచనలు చేశారు. ఎంపిడిఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణాజీపురంలో రామాలయ నిర్మాణానికి విరాళం

కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలంలోని స్వర్ణాజీపురం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న రామాలయానికి టిడిపి నాయకుడు ఇంటూరి ఈనెల 2న లక్షా నూట పదహారు రూపాయలను విరాళంగా సమర్పించుకున్నారు. మాజీ ఎంపిపి చీర్ల మాలకొండయ్య, శివాజీ, టిడిపి స్థానిక నాయకులు వేణు, వెంకటరామరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### అల్లూరులో ఆధార్ సెంటర్ ఏర్పాటు

మండలకేంద్రమైన అల్లూరులో పోలేరమ్మగుడి వద్ద ఇటీవల ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుచేశారు. ఆధార్ కార్డుల్లో మార్పుచేర్పులేమైనా ఉంటే చేసుకోవచ్చుని, సచివాలయంలో సంప్రదించి వాటిని సరిచేసుకోవాలని, ఆధార్ కార్డులు తప్పులు లేకుండా సక్రమంగా ఉంటేనే ప్రభుత్వ పథకాలందుతాయని అల్లూరు నగర పంచాయతి మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### మినగల్లులో 'జగనన్న పచ్చతోరణం'

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లులో ఇటీవల 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న సూచనలతో పంచాయతి కార్యాలయం వద్ద, గ్రామంలోని రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. పంచాయతి కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, గ్రామ సర్పంచ్ పూజిత, రాము తదితరులు పాల్గొన్నారు.

### నందిపాడులో..పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

దుత్తలూరు మండలం నందిపాడు గ్రామంలో ఈనెల 2న దుత్తలూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వనజ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి రోగులకు ఆరోగ్య సూచనలిచ్చారు. ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు చెప్పారు. సూపర్‌వైజర్ జగన్‌మోహన్, ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### సైదాపురంలో..'నాడు-నేడు' సమీక్ష

మండలకేంద్రమైన సైదాపురంలో ఇటీవల ఎంపిడిఓ పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో 'నాడు-నేడు' పనులను సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సత్వరం పనులు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారి శ్రావణ్‌కుమార్, హౌసింగ్ ఏఇ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇవి లెక్కలు కాదు.. హక్కులే..

# న్యాయంకోసం గొంతెత్తండి.. హక్కుల కోసం ఉద్యమించండి



- మార్టిన్ లూథర్ కింగ్ కల ఇంకా మిగిలే ఉంది?
- డిసెంబర్ 10, ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం

*ప్రతి 4 సెకన్లకో ఆకలి చావు..*
**ప్రతి 11 నిమిషాలకో మహిళ మృతి**
*ప్రతి ముగ్గురు స్త్రీలలో ఒకరిపై భౌతిక హింస*
**ప్రతి 24 గంటలకు 3700లకుపైగా రాదారి చావులు**
*ప్రతి ఏటా 3.03 లక్షల ప్రసూతి మరణాలు*
**ప్రతి నిత్యం 1,130కి పైగా హత్యలు**
*రోజుకి 1.90డాలర్ల సంపాదనా లేని 70కోట్ల దారిద్ర్యనారాయణులు*
**ప్రతి ఏటా కరవు కాటకాలతో 9,27,810 చావులు..**
*నవంబర్ 15, 2022 నాటికి ప్రపంచ జనాభా 800 కోట్లు*
**ఇందులో 8.23 శాతం మంది పేదలు**
*ఇండియా జనాభా సుమారు 142 కోట్లు,*
**ఇందులో 25.6 కోట్ల మంది పేదలు**
*చైనా తర్వాత మనమే!*

ఏమిటివన్నీ.. ఎందుకనుకుంటున్నారా?

ఇవన్నీ లెక్కలు కాదు, హక్కులే.. అవును, ఇవన్నీ మానవ హక్కుల లెక్కలే.. డిసెంబర్ 10. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం. భారత దేశానికి స్వాతంత్ర్యం 1947లో వస్తే 1948లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల డిక్లరేషన్‌ను ప్రకటించింది. మనలాగే 75వ వార్షికోత్స వాలకు సిద్ధమైంది.

వ్యక్తిగత ఆస్తితో పాటే అణచివేతా పుట్టింది. దాని పక్కనే ప్రశ్నించే గుణమూ పెరిగింది. ఇది ఒక్కో కాలంలో ఒక్కో రకం. మనిషి మబ్బుల్ని ఆవాసం చేసుకుంటున్నా పక్కోణ్ణి అణగదొక్కే తీరు ఇప్పటికీ ఆగలేదు.

ఏ యుద్ధం ఎందుకు జరిగిందో ప్రజలకు తెలియదు. సుమారు 5 కోట్ల మందిని పొట్టనబెట్టుకున్న రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. ఐరోపా, అమెరికా సహా అనేక దేశాలు జాతి, మత ఘర్షణలతో అట్టుడుకుతున్నాయి. ఐక్యరాజ్య సమితికి ఓ రూపొచ్చింది. ప్రపంచ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, హక్కులు తెరపైకి వచ్చాయి. అందరూ సమ్మతించే మానవ హక్కుల పత్రం తయారీ అనివార్యమైంది. అప్పటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ భార్య ఎలియనోర్ రూజ్‌వెల్ట్ కమిషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఛైర్‌పర్సన్. ఏడాదికిపైగా చర్చలు, అనేక సవరణలు, బోలెడన్ని సూచనలు.. 1948 డిసెంబర్ 10న ఈ చారిత్రాత్మక అంత ర్జాతీయ మానవ హక్కుల పత్రాన్ని పారిస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ కౌన్సిల్ ఆమోదించింది. 1950 నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. ఒక్క దక్షిణాఫ్రికా మాత్రం మార్చి 21న జరుపుతుంది. జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 1960 మార్చి 21 నల్ల జాతీయులుండే షార్ప్‌విల్లీలో జరిగిన మారణకాండలో 69 మంది చనిపోతారు. వేలాది మంది గాయపడతారు. నెల్సన్ మండేలా అధ్యక్షుడైన తర్వాత ఆ రోజును స్మరిస్తూ హ్యూమన్ రైట్స్ డేను ప్రకటించారు.

### ఏమిటీ హక్కులు, ఎవరి హక్కులు?

మానవ హక్కులు సార్వత్రికం. వారెవరైనా.. ప్రతి ఒక్కర్నీ... సమానంగా, గౌరవంగా చూడాలి. ఎటువంటి పక్షపాతం ఉండకూడదు. జాతి, మత, రంగు, స్త్రీ, పురుష, ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉండాలన్నది మానవ హక్కుల ప్రకటన ఉద్దేశం. బైబిల్ తర్వాత అంత ఎక్కువగా 560కి పైగా భాషల్లోకి ఈ హక్కుల పత్రం అనువాదమైంది. అత్యధికంగా డౌన్‌లోడ్ అయిన పత్రమూ ఇదే. ఐక్య రాజ్యసమితిలోని అన్ని దేశాలకు ఇదో ప్రమాణపత్రం.

### ఇదేదో ఎన్జీవోల పనే కాదు...

మానవ హక్కులనడంతోనే ఇవేవో ప్రభుత్వేతర సంస్థలు (ఎన్జీవోలు), హక్కుల సంఘాల పననో, ప్రభుత్వేతర సామాజిక ఉద్యమ సంకేతంగానో భావిస్తుంటాం. కానీ, ప్రపంచ మానవ హక్కుల ఉద్యమ పునాదులు దీనికి భిన్నం. వలసవాదం, సామ్రాజ్యవాదం, బానిసత్వం, జాత్యహం కారం, విభజించి పాలించడం, పితృస్వామ్యం, స్థానికుల అణచివేత పునాదులపై ప్రపంచ మానవ హక్కుల పత్రం తయారైంది. ఈ విశాల విశ్వంలోని సకల జనుల సుఖసంతోషాలు, కనీస జీవన స్థితిగతుల మెరుగు కోసం ప్రపంచ ప్రజలందరూ భుజం భుజం కలిపి పోరాడాలనే ఆలోచన ఈ ప్రకటనకు ప్రాతిపదిక. ఇదంతా సక్రమంగా జరిగిందా? లేదా? అగ్రరాజ్యాలు చిన్న రాజ్యాల హక్కుల్ని హరించలేదా? అనేది వేరే ప్రశ్న. ప్రపంచ చరిత్రలో 1948 డిసెంబర్ 10న ప్రకటించిన మానవ హక్కుల పత్రం ఓ నూతన అధ్యాయం.

### ఇదేమీ సాధించలేదా?

..అంటే ఉన్నాయి. అన్యాయం జరిగిందని చెప్పేందుకు ఓ వేదికుంది. న్యాయం కావాలని అరిచే ఛాన్స్ ఉంది. హక్కుల్ని హరించవద్దని నినదించే వీలుంది. వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా మిగతా ప్రపంచం నన్నెందుకు సమానంగా చూడదని నిలదీసే అవకాశం ఉంది. క్రూరమైన హింసా పద్ధతులపై నిప్పులు చెరగవచ్చు. చీల్చిచెండాడవచ్చు. ఇదంతా నాణానికి ఓ వైపు. మరోపక్క, బాలకార్మిక వ్యవస్థ రద్దును ఆయా దేశాల చట్టాల్లోకి చేర్చింది. వర్ణవివక్ష, బానిసత్వంపై గొంతెత్తింది. ఉరిశిక్ష రద్దును అంతర్జాతీయ చిత్రపటంపైకి తెచ్చి సుమారు 60 దేశాల్లో రద్దు చేయించిన చరిత్రా ఉంది. విమర్శలున్నప్పటికీ స్థానిక హక్కుల కార్యకర్తల వాదనలకు వీలైన పదజాలాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే ఇవేవీ సరిపోవు. చేసింది గోరంతే. చేయాల్సింది కొండంత మిగిలేఉంది.

### స్థానిక స్వభావమే ఎక్కువ...

మానవ హక్కులకు చాలావరకు స్థానిక స్వభావం ఎక్కువ. ఓ దేశ సమస్య మరో దేశానిది కాకపోవొచ్చు. సొంతగొడవలు, స్థానిక హక్కులే ముఖ్యం. ఇతరేతర అంశాలొచ్చినప్పుడే అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై ఆధారపడతారు. ఉదాహరణకు మన దేశంలో లేస్ అనే అమెరికా కంపెనీ మన బంగాళాదుంపల రైతులపై రూ.5 కోట్ల చొప్పున నష్టపరిహా రానికి దావా వేసినప్పుడు రైతుల ఉద్యమానికి అంతర్జాతీయ స్వభావం వచ్చింది. స్థానికుల గళం విశ్వవ్యాప్తమైంది. అంతర్జాతీయ ఒత్తిడి పెరిగింది. లేస్ కంపెనీ వెనక్కి తగ్గింది. అయితే భోపాల్ గ్యాస్ లీక్ లాంటి ఘోర దుర్ఘటనలపై అంతర్జాతీయ సమాజ స్పందన అంతంత మాత్రమే. మానవ హక్కుల ఉద్యమం ఎక్కడ మొదలవుతుందో అక్కడ గుత్తాధిపత్యం, సార్వభౌమాధికారం వెనకడుగు వేస్తుంది. అంతే.

### సంపన్న దేశాల కపటవేషమే ఈ ఉద్యమమా?

75 ఏళ్ల తర్వాతా అంతర్జాతీయ మానవ హక్కుల ఉద్యమంపై రకరకాల వాదనలు, భిన్నాభిప్రాయాలూ ఉన్నాయి. సంపన్న దేశాల కపటవేషమే ఈ హక్కుల ఉద్యమన్న వారూ ఉన్నారు. ధనిక దేశాల హక్కులకు ఇస్తున్న ప్రాధాన్యత పేద దేశాలకు ఎందుకివ్వరన్న విమర్శా ఉంది. ఏదైతేం, ఈ రెండు ప్రపంచాల(ధనిక, పేద) హక్కుల ఉద్య మాల మధ్య అగాధం ఉంది. ప్రధాన స్రవంతి ఉద్యమ వొంటినిండా పక్షపాతమేననే వారూ ఉన్నారు. వీళ్ల వాదన ప్రకారం... మానవ హక్కుల్ని తుంగలో తొక్కేదీ వారే (సంపన్న దేశాలు) ఏమీ ఎరగనట్టు నంగనాచి మాటలు చెప్పేదీ వాళ్లే.. హక్కుల్ని హరించేలా ఆర్థిక పరిస్థితులను సృష్టించడంలో వాళ్లు దిట్టలు. నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధా నాలతో మానవ హక్కుల్ని కుళ్లబొడవడంలో ఈ దేశాల పాత్ర ఎక్కువ. పేద దేశాల స్థితిగతులను పట్టించుకోకుండా ఆధిపత్య మానవ హక్కుల ఉద్యమం గుడ్డిగా నడుస్తోంది. ఈ ఉద్యమాలు ఇలాగే నడిస్తే పేదదేశాలు తమ దారి తాము వెతుక్కోవాల్సి వస్తుందన్న హెచ్చరికలూ ఉన్నాయి. ప్రస్తుత హక్కుల ఉద్యమానికి కొత్త రూపు ఇవ్వాల్సిన అవసరం ఉం దన్నది మరికొందరి భావన. ప్రజలందరి సంస్కృతులతో సాగాల్సిన హక్కుల ఉద్యమం ఉన్నత వర్గాలు, కపటదారులు, దళారులైన సంపన్న వర్గాల సాంస్కృతిక బట్టలలో దర్శనమిస్తోంది... ఇలా అయితే హక్కుల ఉద్యమం మనజాలదని తృతీయ ప్రపంచ దేశాల ఆవేదన.

### హక్కుల భాష అస్పష్టం...

రాజును మించిన రాజభక్తే హక్కుల ఉద్యమంలో కనిపిస్తోందని కొందరు మేథావులు తప్పుబడుతున్నారు. 'మానవ హక్కుల కంటే అదేదో భక్తి పూర్వక వస్తువుగా పరిగణించే వారే అంతర్జాతీయ మానవ హక్కుల ఉద్యమంలో ఎక్కువగా ఉన్నారన్నది వీరి అభిప్రాయం. 'మానవ హక్కుల భాష అస్పష్టంగా ఉంది. ఈ భాష వాస్తవ పరిస్థితిని అద్దం పట్టేలా లేదు. నలుగురికి ఉపయోగపడదామనే దానికన్నా గందరగోళమే ఎక్కువ. ఈ తరహా విమర్శలు చేసే వారు సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ మాటల్నీ ఆసరా తెచ్చుకుంటున్నారు. 'ఈ పదజాలం దుర్వినియోగం కావొచ్చు, వక్రీకరించవచ్చు లేదా సహకరించవచ్చు' అని కెన్నడీ వాదించారు. మానవ హక్కుల లెక్కన సమస్యల చిట్టాలు తయారైతే ఇక అయినట్టే అని పెదవి విరిచే వారూ ఉన్నారు. హక్కుల్ని సాధించడం కన్నా బాధితుల్ని అడ్డం పెట్టుకుని లబ్ధిపొందుతున్న వారి సంఖ్య ఎక్కువని, ఇది మానవ హక్కుల ఉద్యమాన్ని దుర్వినియోగం చేయడమేనన్న వాదనా ఉంది. అయితే, ఈ వాదన మానవ హక్కుల అణచివేతను తక్కువ చేయడానికేనని, సద్విమర్శ కాదని పౌరహక్కుల సంఘాలు వాదిస్తున్నాయి. ఇవన్నీ ఎలా ఉన్నా అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన మాత్రం అనేక హక్కుల పోరాటాలను పటిష్టం చేసేందుకు ఉపయోగపడింది. అంతర్జాతీయ గుర్తింపునకు తోడ్పడింది.

### ఆ కల.. నెరవేరేనా?...

1963 ఆగస్టు 28.. వాషింగ్టన్ డీసీ..

(అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన వచ్చి 15 ఏళ్లు దాటింది).

అమెరికా నల్లజాతీయులు కదం తొక్కుతున్నారు. పదం పాడుతున్నారు. విద్యా, ఉద్యోగం, స్వేచ్ఛ స్వాతంత్ర్యం నాటి నినాదం. సుమారు 2.5 లక్షలమంది హాజరై ఉంటారు. ఆ వేదిక నుంచి 4నిమిషాలు ప్రసంగిం చేందుకు డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్‌కు సమయమిచ్చారు. ప్రసంగం మొదలుపెట్టిన తర్వాత ఆయన్ను ఆపడం ఎవ్వరి తరం కాకపోయింది. 16 నిమిషాలు సాగిన ఆ ప్రసంగమే.. నాకో కల ఉంది (ఐ హావ్ ఏ డ్రీమ్). నిజానికి ఆ ఉపన్యాసానికి పెట్టిన పేరు 'ది నీగ్రో అండ్ ది అమెరికన్ డ్రీమ్'. కానీ చరిత్రలో మాత్రం 'ఐ హావ్ ది డ్రీమ్'గా సుప్రసిద్ధమైంది. పౌరహక్కుల ఉద్యమమంటే ఏమిటో నిర్వచించిన ప్రసంగమది. అందులోని ప్రతి పాయింటూ నేటికీ విలువైంది. ప్రపంచ జనం సాధించుకోవాల్సిందే. అందులో ప్రధానమైన డ్రీమ్ ఆఫ్ ఈక్వాలిటీ (సమానత్వం) కలగానే మిగిలింది. బానిసత్వం నుంచి విముక్తి అయిన నీగ్రోలు, వారిని బానిసల్గా మార్చిన తెల్లజాతీయుల పిల్లలు, మనుమలు, మునిమనుమలు ఒకే టేబుల్‌కు ఎదురెదురుగా కూర్చొని విందుచేయాలన్నది ఇంకా కలే. ప్రజాస్వామ్యమంటేనే అమెరికా అనుకునే చోట ఇప్పటికీ జాతి, వర్ణ వివక్ష నిజంగా విషాదమే. స్వేచ్ఛ, సమానత్వం ఇంకా అరకొరే. మన దేశంలో నిమ్నజాతులను చూసినట్టే నల్లవారిని ఇప్పటికీ అమెరికాలో కడజాతులుగానే చూసేవారున్నారు.

### 2022 మానవ హక్కుల దినోత్సవాల థీమ్ ఇది...

మానవ హక్కుల దినోత్సవం ప్రతి ఏటా రకరకాల లక్ష్యాలు, ఉద్దే శాలతో (థీమ్) జరుగుతుంది. 2021లో సమానత్వం, 2020లో కోవిడ్ నేపథ్యంలో రికవర్ బెటర్, 2019లో యూత్ స్టాండింగ్ అప్ ఫర్ హ్యూమన్ రైట్స్.. ఈ ఏడాది అంటే 2022 థీమ్... డిగ్నిటీ, ఫ్రీడమ్, జస్టిస్ ఫర్ ఆల్. (పరువు ప్రతిష్టలు, స్వేచ్ఛ, అందరికీ న్యాయం) ఈ మూడింటి లక్ష్యంగా వచ్చే ఏడాది డిసెంబర్ 10 వరకు వార్షికోత్సవాలు జరగనున్నాయి. వీటిపై డిసెంబర్ 10న అధికార, అనధికార సంస్థలు, పౌర హక్కుల సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు (ఎన్జీవోలు) సభలు, సమావేశాలు, హక్కుల ప్రాధాన్యతను వివరించే కళారూపాలు నిర్వ హిస్తాయి. హక్కులపై అవగాహన కల్పిస్తాయి.

### 2030 నాటికి పేదరికం పారిపోతుందా?

2030 నాటికి ప్రపంచ సుస్థిరాభివృద్ధికి 170 దేశాలు కంకణం కట్టుకున్నాయి. అర్థంటుగా 17 లక్ష్యాలను ముందుపెట్టుకున్నాయి. మరో 167 అంశాలపై దృష్టి సారించాలనుకున్నాయి. వీటిలో తొలిది పేదరికం. తరగాల్సిన పేదరికం పెరుగుతోంది. ప్రపంచ జనాభాలో 68.5 కోట్ల మంది అంటే 8.2 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. మానవ హక్కుల ఉద్యమం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఇది. ప్రపంచంలో పేదరికం ఎక్కడున్నా పారదోలి ఆకలికి తావులేని సమాజాల్ని నిర్మించాలన్న లక్ష్యం మంచిదే. ఆచరణే ప్రధానం. అభివృద్ధి మానవ హక్కుల్లో ఒకటి. కాని అది కొందరికే పరిమితమైంది. పర్యావరణం సహా అనేక సమస్యలు ఎవ్వరికీ పట్టనివయ్యాయి. అందువల్లే జార్జ్ ఆర్వెల్ అన్ని జంతువులూ సమానమే, కాకుంటే కొన్ని జంతువులు మిగతావాటికంటే చాలా ఎక్కువ సమానం అని చమత్కరిస్తారు.

### జ్ఞానంతోనే సాధ్యం...

హక్కు.. ఓ సుదీర్ఘ పోరాటం. మనం కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరైనా ఆ క్షణాన్ని కనిపెట్టి, 'నేను మాత్రమే అన్నీ పరిష్కరించగలను' అంటే నమ్మాల్సిన పని లేదు. ఈతి బాధలకు చిన్న చిన్న పరిష్కారాలు దొరక వచ్చు. కానీ, మానవ అభ్యున్నతి అతి పెద్ద సమస్య, ఓ పెద్ద హక్కు. ఏ ఒక్కరితోనో అయ్యే పని కాదు. ముందుతరాలు నడిచిన ముళ్లబాటపై సాగాలి. వారందించిన కాగడాను ఎత్తిపట్టుకు ముందుకురకాలి. అలా చేయాలంటే ముందు మన హక్కులేమిటో తెలియాలి. మన పిల్లల గురించి ఆలోచించాలి. చుట్టూ ముప్పిరిగొన్న సమస్యల్ని గుర్తెరగాలి. మనిషికి అన్నింటికంటే గొప్ప వేదన జీవితం కలిగించే గాయాల నుంచి కాక జ్ఞానం నుంచే అంటాడు ప్రముఖ రష్యన్ రచయిత దోస్తోవిస్కీ. మన అంబేద్కర్ కూడా దాదాపు అదేమాట చెప్పారు. అజ్ఞానం ఎల్లకాలం పెట్టుబడి కాదంటారాయన. హక్కులపై అవగాహన పెరిగేకొద్దీ అవస్థలూ పెరుగుతాయి. బడుగు, బలహీన, అణగారిన వర్గాలు, అసమానతలు, ఆకలి, పేదరికం ఉండే ఈ భూతలాన్ని మనిషిని మనిషిగా చూసే స్వర్గ సీమగా, అందరికీ అన్నీ అనే సమన్యాయం దిశగా నడిపించాలంటే రక్తాలు రగిలించి రాజ్యాలు కదిపి కుదిపే వీరులు, మౌనమృదంగాలను పలికించే శూరులు, చెదిరిన గుండెలనదిమి పట్టుకుని ముందుకురికే సామాన్యులు కావాలి.

- అమరయ్య ఆకుల
సీనియర్ జర్నలిస్ట్, 9347921291.

# ‘పాజిటివ్’ పాలిటిక్స్ చేయండి తమ్ముళ్ళూ!

నిద్రలేచిన తరువాత... పొద్దున్నే పత్రికలు చదవాలన్నా..., టీవీలు చూడాలన్నా భయం వేస్తుంటుంది. మీడియా రెండు వర్గాలుగా చీలిపోయింది. ఓ వర్గం వైసీపీ, జగన్‌పై టన్నుల కొద్దీ విమర్శలు ఎత్తిపోస్తుంటే, మరో వర్గం అంతే స్థాయిలో జగన్, ఆయన ప్రభుత్వాన్ని సమర్ధిస్తోంది. పనిలో పనిగా చంద్రబాబుపై కూడా దుమ్మెత్తి పోస్తోంది. ఈ రెండు ప్రచారాల మధ్య నిజం అనేది మాత్రం ఎక్కడో ఉంటుంది. అది ఎక్కడ ఉందో తెలియక పాఠకులు, వీక్షకులు కూడా జుట్లు పీక్కోవలసి వస్తోంది.

జగన్ ప్రభుత్వంపై మీడియాలో వస్తున్న విమర్శలను అంది పుచ్చుకుంటూ.., ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. వైసీపీ వ్యతిరేక మీడియా... ఈ విమర్శలను తిరిగి అందిపుచ్చుకుంటూ... ఎప్పటికప్పుడు వేడి వేడిగా రాష్ట్రమంతా క్షణాలలో చేరేస్తున్నాయి.

జగన్ వ్యతిరేక... అనుకూల మీడియా విషయాన్ని కాసేపు పక్కనపెడితే ప్రతిపక్షాల వారు ఇప్పుడు చేస్తున్న రాజకీయాలను ‘నెగెటివ్ పాలిటిక్స్’ అని పేర్కొనవచ్చు.

‘నెగెటివ్ పాలిటిక్స్’లో బాధ్యత ఏమీ ఉండదు. నాలుకకు పని చెప్పడమే!

ఎక్కడో ఏదో జరిగిపోయిందని టీవీల్లో చూడడం, నిముషాలలో ఓ స్టేట్‌మెంట్ బరికేయడం, మీడియాకు రిలీజ్ చేయడంతో పలువురు ప్రతిపక్ష నేతలు సరిపెట్టేస్తున్నారు. ఇందులో ప్రచారం ఉంది కానీ నిర్మాణాత్మకత లేదు.

ప్రజల పట్ల, సమాజం పట్ల అధికార పార్టీకి ఎంత బాధ్యత ఉందో...., ప్రతిపక్షాలకూ అంతే ఉంది. ప్రతిపక్ష శాసనసభ్యులకూ, వారి రక్షణకూ కూడా ప్రభుత్వమే ప్రజా ధనాన్ని చెల్లిస్తోంది. వారూ ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వాములే అనే కదా ప్రభుత్వం నుంచి వారి జీతభత్యాలు చెల్లిస్తున్నారు!. కాకపోతే, అధికారపక్షానికి అధికారం అనేది చేతిలో ఉంటుంది. ప్రతిపక్షాలకు ఉండదు. దానివల్ల, ప్రభుత్వ యంత్రాంగపు అధికారాన్ని దుర్వినియోగం చేసే అదనపు ఫెసిలిటీ... అధికారపక్ష నేతలకు ఉన్నంతగా...ప్రతిపక్షాలకు ఉండదు. అందువల్ల, అధికార పక్షం కంటే కూడా ప్రజల పట్ల మరింత బాధ్యతాయుతంగా, పాజిటివ్ మైండ్‌సెట్‌తో పనిచేసే అవకాశం ప్రతిపక్షాలకు లభిస్తుంది.

‘ప్రతిపక్షాలు’ అంటే... ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు తెలుగు దేశం, జనసేన, సీపీఐ పార్టీలు.

వీటికి ప్రతి జిల్లా, మండలం, గ్రామ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు వగైరా... వగైరా ఉంటారు. ఈ పార్టీలు నిత్యం అధికార పక్షం పై విమర్శలు గుప్పించడంతో పాటు తమ తమ సభ్యుల్ని సమాజ పునర్నిర్మాణ దిశగా ‘మోటివేట్’ చేయవచ్చు. ఉదాహరణకు ఏలూరు.... కైకలూరు రోడ్డు ఘోరాతి ఘోరంగా తయారయిందని ఈ మధ్య ‘ఈటీవీ’లో ఓ కథనం వచ్చింది. చాలా రోడ్ల మీద గుంతలు, లేచిపోయిన కంకర గురించి ఈటీవీలో వరుస కథనాలు వస్తున్నాయి. వాటిని చూసి, ‘ రాష్ట్రం ఎటు పోతోంది!?’ అంటూ ప్రతిపక్షనేతలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తూ, మీడియాలో ‘ఉచిత’ ప్రచారం పొందడం ఒక పద్ధతి. ఇది ‘నెగెటివ్’ పాలిటిక్స్. దీనికి బాధ్యత ఏమీ ఉండదు. ప్రతిపక్షాల ‘నెగెటివ్’ పాలిటిక్స్ వల్ల, అధికార పక్షానికి కొత్తగా వచ్చే నష్టం ఏమీ లేదు. అధికారపక్షం లాగానే, జనం కూడా రొటీన్ గా తీసుకుంటారు.

అలా కాకుండా, ఏలూరు – కైకలూరు మధ్యలో గల గ్రామాల ప్రజల సహకారంతో ప్రతిపక్ష పార్టీల సభ్యులు, నాయకులు, తమ పార్టీలకు సంబంధించిన వారిని సమీకరించుకుని, ఆ రోడ్డును చదును చేశారనుకుందాం. ఇది ‘పాజిటివ్’ పాలిటిక్స్. ప్రజలలోకి ఓ బలమైన మెసేజ్ వెళుతుంది. అధికారపక్షంలో కూడా కదలిక వస్తుంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తుంది. మీడియా ‘ఊక దంపుడు’ ప్రచారం లేకుండానే, ప్రజలలో ప్రతిపక్షాల పట్ల సద్భావన మొగ్గ తొడుగుతుంది. అధికారపక్ష సభ్యులు... నోటికి పని చెప్పడం కొంచెం కష్టమవుతుంది.

సమస్యల విషయం లో ప్రభుత్వపు ప్రస్తుత నిస్సహాయతను ప్రతిపక్షాలు పాజిటివ్‌గా అందిపుచ్చుకోవచ్చు. ( ప్రజల సమస్యలు పరిష్కరించాలనే )మనసు ఉంటే...., మార్గం ఉండక పోదు కదా!

ప్రతిపక్షాలు మూడింటిలోనూ తెలుగుదేశంకు ఎక్కువ బాధ్యత ఉంది. అదే పెద్ద పార్టీ కనుక. వ్యవస్థీకృత కార్యకర్తల యంత్రాంగం భారీగా ఉంది తెలుగు దేశం పార్టీకే గనుక. దానికి నలభై లక్షల సభ్యత్వం ఉంది కనుక.

గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకత్వం పుష్కలంగా తెలుగుదేశం పార్టీకి ఉంది.

ఇంతమంది కార్యకర్తల్ని పెట్టుకుని, టీడీపీ ఏం చేస్తున్నట్టు? 2024 లో అధికారంలోకి రాబోతున్నామని కలలు కంటూ కాలక్షేపం చేస్తున్నారా?

తెలుగుదేశం యువనేత నారా లోకేష్ వచ్చే జనవరి 27 నుంచి ఓ ఏడాది పాటు రాష్ట్రంలో పాదయాత్ర చేయాలని నిర్ణయించినట్టు వార్తలు వచ్చాయి. ఆయన కూడా ఆ విషయాన్ని స్వయంగా ప్రకటించారు.

ఆయన పరంగా ఇది చాలా పెద్ద నిర్ణయం. ఆయన రాజకీయ జీవితంలో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది.

‘పాదయాత్ర’ అనేది ఇప్పుడు వివిధ ప్రతిపక్ష నేతల రాజకీయ అమ్ములపొదిలో ఇప్పుడు ఒక ముఖ్య అస్త్రంగా మారిపోయింది.

రాజశేఖరరెడ్డి తన పాదయాత్ర ద్వారానే రాష్ట్ర రాజకీయ గమనాన్ని శాశ్వతంగా మలుపు తిప్పారు.






చంద్రబాబునాయుడు పాదయాత్ర ద్వారానే రాజకీయ పునరుజ్జీవనం పొందారు. జగన్మోహనరెడ్డిని సైతం పాదయాత్ర ద్వారానే అన్నివర్గాల వారు ఆశీర్వదించారు.

ఈ ముగ్గురూ ‘ముఖ్యమంత్రి’ పదవే లక్ష్యంగా పాదయాత్ర చేశారు. తమ లక్ష్యాన్ని అందుకున్నారు.

ఇప్పుడు, లోకేష్ ప్రారంభించబోతున్న పాదయాత్ర లక్ష్యం ఏమిటన్నది తెలియడం లేదు.

తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తే, ముఖ్యమంత్రి కాగలరని అందరూ భావిస్తున్న చంద్రబాబు నాయుడు ఇప్పటికీ చాలా చురుగ్గా... చలాకీగా ఉన్నారు. కానీ, వయోభారం దృష్ట్యా, ఆయన చేపట్టలేని పాదయాత్రను ఆయన తరఫున.... నారా లోకేష్ చేపడుతున్నారా? లేక, ప్రజలలో... తన వారసత్వం పట్ల మరింత ‘యాక్సెప్టబిలిటీ’ కోసం పాద యాత్ర చేపడుతున్నారా? లేక, జగన్ పైన... వైసీపీ ప్రభుత్వం పైన... నేతలపైన విమర్శల జడివాన కురిపించడానికి పాదయాత్రను ఉద్దేశిస్తున్నారా?

ఏ రాజకీయ నాయకుడైనా ఒక్కసారి మాత్రమే చేయగలిగిన పాదయాత్రను... లోకేష్ చాలా చిన్న వయసులోనే చేయబోతున్నారు. ఆయన రాజకీయ జీవితంలో ఖచ్చితంగా ఇదో ముఖ్య ఘట్టంగా గుర్తుండిపోతుంది.

అయితే, ఆయన ఈ పాదయాత్ర ను ‘ నెగెటివ్ పాలిటిక్స్’కు వాడుకుంటారా... లేక, ‘పాజిటివ్ పాలిటిక్స్’కు వాడుకుంటారా అనేది చూడాల్సి ఉంది.

నెగెటివ్ పాలిటిక్స్ చేస్తే...!

ప్రభుత్వపరంగా జరుగుతున్న అవకతవకలు, లోతుపాట్లపై విరుచుకు పడితే, సభికులు చప్పట్లు కొడతారు. ఈలలు వేస్తారు. మీడియా ప్రచారం బాగా లభిస్తుంది. లోకేష్ ప్రసంగాలకు, పంచ్‌లకు, వ్యంగ్యాస్త్రాలకు... ట్వీట్ల వల్ల తెలుగుదేశం పార్టీకి మంచి మైలేజ్ వచ్చిందని... తెలుగుదేశం హెడ్ ఆఫీసులో నేతలు మురిసిపోతారు.

కానీ, జనం మరుసటి రోజుకు మరిచిపోతారు. లోకేష్ మళ్ళీ కొత్త టాపిక్‌లు, కొత్త పంచ్ డయలాగ్‌లు, కొత్త వ్యంగ్యాస్త్రాలు, కొత్త ట్వీట్‌లు ఎంచుకోవాలి. వీటివల్ల వైసీపీకి చీమ కుట్టినట్టు కూడా ఉండదు. కాకపోతే, మీడియాకు మాత్రం ఏదో సామెత లాగా బోలెడంత హడావుడి, కాలక్షేపం ఉంటుంది.

‘పాజిటివ్ పాలిటిక్స్ చేస్తే..!

‘పాజిటివ్ పాలిటిక్స్’ అంటే.. లోకేష్ ఓ గ్రామానికో, ప్రాంతానికో వెళ్ళినప్పుడు... అక్కడి వారితో కూర్చుని వారు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు నిరావేశంగా ఆకళింపు చేసుకోవడం, పార్టీ సభ్యులు ఇతరుల సహకారంతో వాటిని తాము ఏ మేరకు పరిష్కరించగలం అనే విషయం అక్కడే చర్చించడం.... అవసరాన్ని బట్టి పార్టీ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేయడం... ఇందులో గ్రామంలోని యువతను భాగస్వాములను చేయడం... రాజకీయాలు అసలు మాట్లాడకపోవడం. అవసరమైతే, కార్యకర్తలతో కలిసి శ్రమదానం చేయడం వంటివాటిల్లో పాల్గొనడమే... ‘పాజిటివ్ పాలిటిక్స్’.

రాజకీయాలు అస్సలు మాట్లాడకపోవడమే అసలైన రాజకీయం అని లోకేష్ తెలుసుకుంటే... ‘పాదయాత్ర’ లక్ష్యం నెరవేరినట్టే.

ప్రత్యర్థులపై రాజకీయ విమర్శలకు దూరంగా ఉండడంలోనే ఆయన విజయ రహస్యం ఉంది.

అసంఖ్యాకంగా ఉన్న టీడీపీ శ్రేణులను నిర్మాణాత్మక మైండ్‌సెట్ దిశగా లోకేష్... ఈ పాదయాత్రలో మోటివేట్ చేయగలిగితే, మిగిలిన జనసేన, సీపీఐ వంటి ప్రతిపక్ష పార్టీల వారు కూడా పలుగు పారా పట్టుకుని రోడ్ల మరమ్మతులకు, ఇతర సమస్యల పరిష్కారానికి బయలుదేరుతారు.

ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం అవుతుంది. లోకేష్ పర్యటించబోయే గ్రామాలు... ప్రాంతాలలో జనం నిత్య జీవనంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం కూడా ఆరా తీస్తుంది. కొన్ని సమస్యలు అయినా పరిష్కారం అవుతాయి. ఆ మేరకు ఆయన పాదయాత్ర వల్ల, ఆయా గ్రామాలకు మంచి జరిగితే లోకేష్ పట్ల సద్భావన అనేది టీడీపీ శ్రేణులకే పరిమితం కాదు కదా!

ఇదీ పాజిటివ్ పాలిటిక్స్‌లో ఇమిడి ఉన్న బలం. శక్తి.

నెగెటివ్ పాలిటిక్స్ చేయడానికి చంద్రబాబు ఉన్నారు కదా! . కొమ్మారెడ్డి పట్టాభి ఉన్నారు. బొండా ఉమా ఉన్నారు. వర్ల రామయ్య ఉన్నారు. దేవినేని ఉమా ఉన్నారు. అశోక్‌బాబు, జవహర్ ఉన్నారు. ధూళ్ళిపాళ్ళ నరేంద్ర ఉన్నారు. యనమల రామకృష్ణుడు ఉన్నారు. తెలుగుదేశం కార్యాలయం ఉంది. నెగెటివ్ పాలిటిక్స్ పనిని వీరికే వదిలేయాలి.

లేకపోతే, వీరికీ.... లోకేష్ పాలిటిక్స్‌కూ తేడా ఏముంటుంది !?

‘పాజిటివ్ పాలిటిక్స్’ చేయడానికి ఒక మానసిక స్థాయి, హుందాతనం కావాలి. సమాజంపై ప్రేమ ఉండాలి. జనం జీవన స్థితిగతులు మెరుగు పరచాలనే ఆపేక్ష, చిత్తశుద్ధి ఉండాలి. అన్ని వర్గాలపట్ల సమభావన ఉండాలి. సగటు పొలిటీషియన్ కంటే ఉన్నతంగా ఆలోచించగలిగే మానసిక స్థితి ఉండాలి.

ఢిల్లీలో కేజ్రీవాల్ పార్టీ విజయానికి ‘పాజిటివ్ పాలిటిక్సే’ కారణం.

నెగెటివ్ పొలిటిక్స్‌కు ఇవేం అవసరం లేదు. నోట్లో నాలిక ఉంటే సరిపోతుంది.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## పెద్దాసుపత్రిలో మెరుగైన సేవలందించాలి

**జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశించారు. ఈనెల 6న కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నెల్లూరు సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, ఏపీ ఎంఎస్ఐడిసి ఇఇ విజయ భాస్కర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డాక్టర్ గీతాలక్ష్మి, కమిటీ కో–ఆర్డినేటర్ సునంద లక్ష్మి, సభ్యులు అభిషేక్, శ్రీనివాసులురెడ్డి, వీరభద్రారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కుర్రోడు అదరగొట్టాడు



నెల్లూరుకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అనీష్ డానీ అంతర్జాతీయ పోటీల్లో అదరగొట్టాడు. మనదేశం నుంచి ప్రాతినిథ్యం వహించి అద్వితీయ ప్రతిభతో ‘ద్వితీయ’ స్థానం సాధించి థాయ్‌లాండ్‌లో నెల్లూరు పేరును మార్మోగించాడు. ఈనెల 4న హోరాహోరీగా జరిగిన ఆ పోటీల్లో అనీష్‌కు రజత పతకం లభించడం పట్ల ఆంధ్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ, ఆ పోటీల్లో చైనా క్రీడాకారుడు చుంగ్‌షియాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8-21, 24-22, 19-21 పాయింట్ల తేడాతో మన నెల్లూరు క్రీడాకారుడు అనీష్ అద్భుత విజయం సాధించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. నెల్లూరుజిల్లా నుంచి అంతర్జాతీయ పోటీల్లో రాణించిన తొలి క్రీడాకారుడుగా అనీష్ నిలిచాడని ఆయన కొనియాడారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, నిమ్మల వీరవెంకటేశ్వర్లు, మద్దిపాటి ప్రసాదరావు తదితరులు కూడా అనీష్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

# కళ్యాణ వైభోగం!



కిలివేటి సంజీవయ్య - సుభాషిణి దంపతుల కుమార్తె, (మాజీమంత్రి, సీనియర్ కాంగ్రెస్‌వాది కీ॥శే॥ పసల పెంచలయ్య మనుమరాలు) **సౌజన్య - డాక్టర్ శ్రావణ్‌కుమార్**లను ఆశీర్వదించి అభినందిస్తున్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి.

## సౌజన్య - శ్రావణ్ కుమార్

సూళ్లూరుపేట శాసనసభ్యుడు కిలివేటి సంజీవయ్య - శ్రీమతి సుభాషిణిల పెద్దమ్మాయి **సౌజన్య - డాక్టర్ శ్రావణ్‌కుమార్**ల కళ్యాణం డిసెంబర్ 7వ తేది నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ పెళ్లి కోసం ప్రత్యేకంగా నెల్లూరుకు వచ్చి కొత్త దంపతులను ఆశీర్వదించి వెళ్లారు. పలువురు ప్రభుత్వ సలహాదారులు, రాష్ట్ర మంత్రులు, వైకాపా పార్లమెంటు సభ్యులు శాసన సభ్యులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మెన్లు, రాజకీయ, వ్యాపార, పారిశ్రామిక ప్రముఖులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సంజీవయ్య అభిమా నులు, దివంగత నేత పసల పెంచలయ్య అనుయాయులు ఈ వివాహ వేడుకలో పాల్గొని సౌజన్య - శ్రావణ్‌కుమార్‌లను దీవించారు.

నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.







**సంజీవయ్య కుమార్తె కళ్యాణానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌కి కనుపర్తిపాడులోని హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న నెల్లూరుజిల్లా వైకాపా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**

# శ్రీసిటీలో.. ఈఎస్ఐసి ఉన్నతాధికారులు

## కార్మికుల కుటుంబాలకు అండగా..
## వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి కోసం స్థల పరిశీలన

రాష్ట్రానికి చెందిన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ (ఈఎస్ఐసి) రీజనల్ డైరెక్టర్ ఎ.వేణుగోపాల్, రాష్ట్ర మెడికల్ ఆఫీసర్ షకీల్ గూటీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రవికుమార్, డిప్యూటీ డైరెక్టర్ పద్మప్రియ, జెడిఎంఎస్ బి.చంద్రశేఖర్, ఇతర అధికారుల బృందం ఈనెల 7వ తేది బుధవారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ప్రముఖ పరిశ్రమలవాడగా పేరొందిన శ్రీసిటీ సమీపంలో నూతనంగా 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ విషయాలపై సమీక్షించేందుకు అక్కడకు వచ్చిన అధికారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. శ్రీసిటీ



సమీపంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం ఏపిఐఐసి, రెవిన్యూ, శ్రీసిటీ అధికారులతో సమావేశమై ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీ పరిసరాల్లో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పెద్దసంఖ్యలో పారిశ్రామిక కార్మికులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. భవిష్యత్తులో ఆసుపత్రి స్థాయి విస్తరణను కూడా దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేందుకు తాము అన్ని విధాలా సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

# నెల్లూరు రైల్వేస్టేషన్‌కు.. ఇక మహర్దశ!

- **రూ. 102 కోట్ల వ్యయంతో ఆధునీకరణ**
- **ముమ్మరంగా జరుగుతున్న పనులు**

*ఎంతోకాలంగా జిల్లా ప్రజానీకం ఎదురుచూస్తున్న నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు ప్రారంభం కావడంతో ప్రయాణీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో రైల్వేస్టేషన్ రూపుదిద్దుకోనుండడం శుభపరిణామం. ఇక్కడ అత్యంత ఆధునిక సౌకర్యాలు ఏర్పాటుకు ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని పనులు పూర్తయ్యాయి కూడా. దీంతో, నెల్లూరు రైల్వేస్టేషన్‌కు త్వరలోనే మహర్దశ వస్తుందని అందరూ భావిస్తున్నారు.*

నెల్లూరు రైల్వేస్టేషన్ ఇక కొద్దికాలంలోనే రూపుమారిపోతుంది. సరికొత్త హంగులతో, అందంగా రైల్వేస్టేషన్ ముస్తాబవుతోంది. ఈ రైల్వేస్టేషన్ నుంచి రోజూ కనీసం 30వేల మందికిపైగా ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుండడంతో, రాను రాను ఆ సంఖ్య మరింత గణనీయంగా పెరుగుతుందని రైల్వేశాఖ అంచనా వేసి, అందుకు తగ్గట్టుగా ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించడానికి సమాయత్తమైంది. రైల్వేస్టేషన్‌లను సుందరంగా తీర్చిదిద్దేందుకు మరియు ప్రపంచస్థాయి సౌకర్యాలను కల్పించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ 'రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి' అనే ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను చేపట్టడం, ఇందులో భాగంగా, నెల్లూరుస్టేషన్ పునరాభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించడం సంతోషకరం. ఈ కీలకమైన అభి



వృద్ధి పనుల కాంట్రాక్ట్‌ను రైల్వేశాఖ కొద్ది నెలల క్రితమే ఎస్‌సిఎల్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ (హైదరాబాద్) సంస్థకి కేటాయించిందని, ఈ పనులను 21 నెలల వ్యవధిలో అంటే.. మే 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, నిర్ణీత గడువులోగా ఈ పనులను పూర్తిచేస్తామని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. ఈ ముఖ్యమైన ప్రాజెక్ట్ పురోగతిని ప్రతి దశలోనూ పర్యవేక్షిస్తున్నామని, ఈపీసీ విధానంలో అప్‌గ్రెడేషన్ పనులు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. అవసరమైన ఆధునిక సౌకర్యాలు, ప్రయాణీకుల సౌకర్యాల ఏర్పాటు, నిర్ణీత వ్యవధిలో పనులను పని చేసేలా పూర్తి సహకారం అందించాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

### ప్రయాణీకుల సౌకర్యాలకే ప్రాధాన్యత

ముఖ్యంగా ఈ రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తాగునీటి సరఫరా, నీటి శుద్ధి, భూగర్భ ఓవర్ హెడ్ ట్యాంకుల ఏర్పాటు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ తదితర నిర్మాణాలు ఈ ప్రణాళికలో ఉన్నాయి. ఇప్పటికే సైట్ కార్యాలయాలు, కాంక్రీట్ ల్యాబ్ పనులు, సామగ్రి నిల్వచేసుకునేందుకు స్టోరేజ్ షెడ్‌ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. స్టేషన్ ఆవరణలోని కోర్టు, రైల్వే పోలీస్ కార్యాలయాలకు ఆటంకం కలుగకుండా తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. 1వ నంబర్ ప్లాట్‌ఫాం పొడిగింపులో భాగంగా షెడ్ల నిర్మాణానికి అవసరమైన కాంక్రీట్ దిమ్మెలను నిర్మిస్తున్నారు. ఇక్కడ కవర్ ఓవర్ ప్లాట్‌ఫాం(సిఓపి)లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సిఓపి షెల్టర్‌ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. తూర్పువైపున స్టేషన్ బిల్డింగ్ రూపకల్పన పూర్తయింది. ఆధునీకరణలో భాగంగా, ఈ రైల్వేస్టేషన్ ఏర్పాటైనప్పటి నుండి 2-3 ప్లాట్‌ఫాంల మధ్య ఉన్న స్టేషన్ మాస్టర్ కంట్రోల్ రూమ్‌ను 1వ నంబరు ప్లాట్‌ఫాంలోకి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. కొత్తగా నిర్మాణంగావించే కంట్రోల్‌రూమ్, స్టేషన్‌మాస్టర్ రూమ్‌లలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గతంలో కన్నా ఎంతోమెరుగైన పరికరాలను ఏర్పాటుచేయాలని కూడా సంకల్పించారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com